

# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV

STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 257 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం, 18, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్







# జై భీమ్

తెలుగు దినపత్రిక

POWER OF PEOPLE

సమస్యలపై సమరంగా

Jai Bheem TV
STRUGGLE FOR JUSTICE

సామాన్యుడి ఆయుధంగా




సంపుటి - 07 | సంచిక 257 | ఎడిటర్ : బరిగెల శివ | మంగళవారం, 18, ఆగస్టు 2026 | పేజీలు 8 | వెల రూ. 5

పబ్లిషర్స్ తెలంగాణ : హైదరాబాద్, ఆంధ్రప్రదేశ్ : విజయవాడ, ఢిల్లీ, కర్ణాటక, బెంగళూరు, తమిళనాడు, చెన్నై, మహారాష్ట్ర, ముంబై, గోవా, కేరళ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్, అమెరికా, లండన్, ఆస్ట్రేలియా, దుబాయ్, మస్కట్










డాక్టర్ బరిగెల శివ
జై భీమ్ సంస్థల ఫౌండర్, చైర్మన్

# సేవా భావంలో..
# శిఖరాగ్రుడు!



శాశ్వత సేవల కోసం సాహసం

రాష్ట్ర పోలీస్ బాస్ సేవలన్నీ ప్రత్యేకమే

పోలీస్ సేవలు పటిష్టతే పోలీస్ బాస్ లక్ష్యం

పోలీస్ శాఖను పటిష్ట పరచడం కోసం సర్వ ప్రయత్నాలు చేస్తున్నారు

ఆదర్శవంతంగా నిలపడం కోసం పరితపిస్తున్నారు

మునుపెన్నడూ లేని విధానాలను అమలుపరుస్తున్నారు

పోలీసులపై సేవా బాధ్యతను పెంచుతున్నారు

డ్రగ్స్ పై ఉక్కు పాదం మోపుతున్నారు

ప్రతిష్టాత్మకమైన మార్పుల కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారు

డీజీపీగా సీవీ ఆనంద్ తెలంగాణ పోలీసింగ్‌లో కొత్త దిశ

డ్రగ్స్ కట్టడికి ప్రాధాన్యం.. సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి

కృత్రిమ మేధ,ఆధునిక సాంకేతికతతో పోలీసింగ్.. రోడ్డు భద్రతకు ప్రత్యేక వ్యవస్థ

పోలీసుల సంక్షేమం, ఆరోగ్యం,ఫిట్‌నెస్‌కు పెద్దపీట

హైదరాబాద్ (జై భీమ్ డెస్క్)

రాష్ట్ర పోలీస్ శాఖలో గణనీయమైన మార్పులను తీసుకురావడానికి తెలంగాణ రాష్ట్ర డిజిపి సీవి ఆనంద్ ఐపీఎస్ తీవ్రంగా కృషి చేస్తున్నారని డాక్టర్ బరిగెల శివ కొనియాడారు.రాష్ట్ర పోలీస్ శాఖ నిర్వహిస్తున్న సేవలలో, లక్ష్యసాధనలో ఎక్కడ రాజీ పడలేని విధివిధానాలను అమలుపరుస్తూ పోలీస్ శాఖలో మునుపెన్నడూ లేని విధమైన ప్రజావిశ్వాసాన్ని ప్రజా నమ్మకాన్ని చేరువయ్యేలా పోలీస్ శాఖను తీర్చిదిద్దడం రాష్ట్ర పోలీస్ శాఖను నూతన పందాలో నడిపిస్తున్నారని అభినందించారు.ప్రజలకు పోలీస్ శాఖకు ఏ విధమైనటువంటి అవినాభావమైన సంబంధాలు ఉంటాయో వాటిని పోలీస్ సేవల్లో కనిపించబడే విధంగా ముమ్మర ప్రయత్నాలు చేస్తూ ఫ్రెండ్లీ పోలీసింగ్, దృఢమైన పోలీసింగ్, సాంకేతిక పరమైన పోలీసింగ్ బలపడడం కోసం అన్ని విధాలుగా కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పోలీస్ శాఖలో విపరీతమైన అవినీతి సంతరించు కోవడాన్ని రాష్ట్ర పోలీస్ బాస్ ముందస్తుగానే పసిగట్టి వాటిని ఎక్కువ స్థాయిలో నిర్మూలించడానికి ప్రయత్నం చేస్తుండడం రాష్ట్ర పోలీస్ శాఖకు శుభపరిణామం అన్నారు.అక్రమంగా కేసులు

- మిగతా 2లో..





## డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పోలీసింగ్‌లో మార్పులకు శ్రీకారం

తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ

6



## కళ్యాణ, షాదీముబారక్ కొనసాగుతుంది

గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు

అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి

దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం

ధర్నాలు చేసే వారు పథకలంఓ తప్పిదాలపై మాట్లాడాలి

మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి



4

## మేయర్ పీఠంపై అధికార పార్టీలోనే హోరాహోరీ పోటీ?

మేయర్ పదవిపై

పలువురు ఆశావహుల కన్ను..

అధిష్ఠానం ఆశీస్సుల కోసం నేతల ప్రయత్నాలు

తాజా మాజీ మేయర్ గుండు సుధారాణితో పాటు పలువురి పేర్లు తెరపైకి

తెరవెనుక మరో

ఆశావహుడి కోసం చర్చ




6

## విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి

విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది

ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం


గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు

వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం

కార్పొరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ

సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

5



జై భీమ్ POWER OF PEOPLE

# సేవా 'భావంలో' శిఖరాగ్రుడు














మొదటి పేజీ తరువాయి

బనాయించడం మొదలుకొని క్రైమ్ రేటును తగ్గించే ప్రయత్నంలో దూర దృష్టితో ఉన్నారన్న సంగతిని రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. సైబర్ నేరాల విషయంలోనైతేనేమి డ్రగ్స్ నిర్మూలన విషయం అయితేనేమి ఈవ్ టీజింగ్ ర్యాగింగ్స్ లాంటి విషయాలలో రాష్ట్ర పోలీస్ శాఖ తమ ప్రతాపం చూపిస్తుందని గర్వంగా చెప్పారు. పోలీస్ శాఖలో పనిచేస్తున్న ప్రతి ఒక్కరు గర్వపడే విధంగా రాష్ట్ర పోలీస్ శాఖను తమదైన శైలిలో బలోపేతం చేయడం కోసం ప్రతి కమిషనరేట్ పరిధిలో, ప్రతి జిల్లా పరిధిలో జరుగుతున్న కార్యక్రమాల పట్ల ఎప్పటికప్పుడు శ్రద్ధ వహిస్తూ పోలీస్ ఉన్నతాధికారులకు తగు సూచనలు చేస్తూ రాష్ట్ర పోలీస్ శాఖ విధివిధానాల పట్ల ప్రజలకు అపారమైన విశ్వాసం పెరగడం కోసం కృషి చేయడం రాష్ట్ర పోలీస్ శాఖలో అద్భుత ఘట్టంల భావించాలన్నారు. మహిళలకు రక్షణగా నిలవడం కోసం పోలీస్ శాఖ నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా కార్యక్రమాలు అద్వితీయమైన ఫలితాలను రాబడుతున్నాయని కొనియాడారు. దేశం మొత్తంలో ఇతర రాష్ట్రాలతో తెలంగాణ రాష్ట్ర పోలీస్ శాఖను పోల్చి చూడగా తెలంగాణ రాష్ట్ర పోలీస్ గణనీయమైన సేవలు ఇతర రాష్ట్రాల పోలీస్ శాఖలు అందుకోవడంలో ఎంతో దూరాన ఉన్నారన్నది వాస్తవమన్నారు. రాజకీయపరమైన కక్ష సాధింపు చర్యలపై క్రింది స్థాయి పోలీసు అధికారులు రాజకీయ నాయకులకు తలొగ్గి చేస్తున్న క్రియల పట్ల ప్రత్యేక దృష్టి పెట్టారని రాష్ట్ర పోలీస్ శాఖ అన్ని వర్గాల ప్రజలకు అన్ని రాజకీయ పార్టీలకు సమాన ప్రాధాన్యతను ఇవ్వడంకోసం కృషి చేయాల్సిన బాధ్యత ఎంతో ఉందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర డిజిపి సివి ఆనంద్ ఐపీఎస్ బాధ్యతలు చేపట్టినప్పటి నుండి నేటి వరకు రికార్డు స్థాయిలో నిర్వహించిన అద్భుత ఫలితాలను పూర్తిస్థాయిలో వివరించారు.

### పోలీస్ శాఖపై సివి ఆనంద్ ఐపీఎస్ ప్రత్యేక దృష్టి..

తెలంగాణ డీజీపీగా సీవీ ఆనంద్ బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి రాష్ట్ర పోలీసు శాఖలో పలు కీలక మార్పులు, సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. 2026 మే 1న డీజీపీగా బాధ్యతలు చేపట్టిన ఆయన.. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, రోడ్డు ప్రమాదాల నివారణ, ట్రాఫిక్ నిర్వహణ, మహిళలు--పిల్లల భద్రత, ఆధునిక సాంకేతిక పరిజ్ఞాన వినియోగం, పోలీసుల సంక్షేమం వంటి అంశాలకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన వెంటనే ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు తమ తమ ప్రాంతాల్లోనే ఉండి విధులపై దృష్టి పెట్టాలని, మర్యాదపూర్వకంగా తనను కలవడానికి ప్రత్యేకంగా హైదరాబాద్‌కు రావాల్సిన అవసరం లేదని సీవీ ఆనంద్ స్పష్టం చేశారు. పోలీసు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి ప్రజల సమస్యలను పరిష్కరించడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. మే 2న గవర్నర్, ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన డీజీపీ.. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టనున్న చర్యలను వివరించారు. ముఖ్యంగా పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో మాదకద్రవ్యాల వ్యతిరేక కమిటీలను ఏర్పాటు చేసి విద్యార్థుల్లో అవగాహన పెంచే దిశగా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. మే మొదటి వారంలోనే నేర నియంత్రణ, దర్యాప్తు, ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించేందుకు ప్రణాళిక రూపొందించారు. కృత్రిమ మేధ, డ్రోన్లు, నేర విశ్లేషణ వ్యవస్థలను వినియోగించి పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా మార్చాలని అధికారులకు సూచించారు. మే 15న పోలీసింగ్‌కు కొత్త దిశను నిర్దేశిస్తూ మాదకద్రవ్యాలు, సైబర్ నేరాలు, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత బ్యూరో ఏర్పాటు దిశగా చర్యలు చేపట్టారు. పోలీసుల ఆరోగ్యం, శారీరక దృఢత్వానికి కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. మే 16న కఠినమైన చట్ట అమలుతో పాటు ప్రజలకు స్నేహపూర్వకంగా ఉండే సమర్థవంతమైన పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సీవీ ఆనంద్ సూచించారు. నేరస్థులపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు సామాన్య ప్రజలకు పోలీసు సేవలు సులభంగా అందేలా వ్యవస్థను రూపొందించాలని స్పష్టం చేశారు. మే 18న మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా తగ్గిన నేపథ్యంలో ప్రత్యేక నిఘా విభాగం, గ్రేహౌండ్స్ వంటి విభాగాలను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా పునర్వ్యవస్థీకరించాల్సిన అవసరాన్ని గుర్తించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా వంటి కొత్త తరహా సవాళ్లను ఎదుర్కొనేందుకు పోలీసు వనరులను సమర్థంగా వినియోగించాలని సూచించారు. మే 22న ఉన్నతాధికారులతో జరిగిన సమావేశంలో తెలంగాణ పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత పెంచాలని, సంప్రదాయ పోలీసింగ్‌తో పాటు కృత్రిమ మేధ, సాంకేతిక పరిజ్ఞాన ఆధారిత పోలీసింగ్‌ను విస్తరించాలని డీజీపీ వివరించారు. మాదకద్రవ్యాల నియంత్రణను భవిష్యత్‌లో ప్రధాన ప్రాధాన్య అంశంగా గుర్తించారు. మే 23న డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేశారు. కృత్రిమ మేధ ఆధారిత పోలీసింగ్, నేరాల దర్యాప్తు, శాంతిభద్రతల నిర్వహణ, పోలీసుల సామర్థ్యాల పెంపు వంటి అంశాల్లో ఈ బృందం పనిచేసేలా చర్యలు చేపట్టారు. మే 25న డీజీపీ కార్యాలయంలోని వివిధ విభాగాలను స్వయంగా పరిశీలించిన సీవీ ఆనంద్.. కార్యాలయ పరిశుభ్రత, ఫైళ్ల నిర్వహణ, రికార్డు గదుల వినియోగం, సమావేశ మందిరాలు, శిక్షణా హాళ్లను మెరుగుపరచాలని ఆదేశించారు. కార్యాలయ వ్యవస్థను మరింత క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. మే 26న సీనియర్ మావోయిస్టు నాయకుడు పసునూరి నరహరి అలియాస్ విశ్వనాథ్ పోలీసుల ఎదుట లొంగిపోయిన సందర్భంలో పోలీసు శాఖ చర్యలను డీజీపీ స్థాయిలో పర్యవేక్షించారు. మే 29న తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత బ్యూరో, తెలంగాణ మాదకద్రవ్యాల వ్యతిరేక--భద్రతా క్లబ్బులు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం వంటి వ్యవస్థల ఏర్పాటుపై అధికారులతో విస్తృత చర్చలు నిర్వహించారు. గ్రేహౌండ్స్, ఆక్టోపస్, ప్రత్యేక నిఘా విభాగం, భద్రతా విభాగాల్లోని సిబ్బందిని అవసరానికి అనుగుణంగా పునర్వినియోగించడంపైనా చర్చ జరిగింది. ఆహార కల్తీ నియంత్రణకు ప్రత్యేక వ్యవస్థ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించారు. జూన్ 10న ఆదిలాబాద్ జిల్లా పర్యటనలో భాగంగా నేర నియంత్రణ, సైబర్ నేరాలు, మాదకద్రవ్యాలు, ట్రాఫిక్, రోడ్డు ప్రమాదాల నివారణపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ప్రతిరోజూ ప్రత్యేక ఫిర్యాదుల సమయాన్ని ఏర్పాటు చేసి అధికారులు అందుబాటులో ఉండాలని సూచించారు. అదే రోజు ఆదిలాబాద్ కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రంలో సమగ్ర సీసీ కెమెరాల పర్యవేక్షణ వ్యవస్థను ప్రారంభించారు. పట్టణంలోని సుమారు 600 కెమెరాలు, జిల్లాలోని 1,200కుపైగా కెమెరాలను సమన్వయం చేసి నేరాలు, ట్రాఫిక్, ప్రమాదాలను పర్యవేక్షించాలని సూచించారు. జూన్ 11న జాతీయ లోక్ అదాలత్ నేపథ్యంలో తెలంగాణ పోలీసు శాఖ, న్యాయ సేవాధికార సంస్థ మధ్య సమన్వయాన్ని పెంచి పరిష్కరించదగిన కేసులను గుర్తించి త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. జూన్ 12న నేర దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞాన వినియోగాన్ని మరింత పెంచేందుకు నేర పరిశోధనా విభాగం ప్రధాన కార్యాలయంలో అధునాతన కంప్యూటర్ ప్రయోగశాల, మహిళల కోసం సైబర్ ప్రయోగశాలను ప్రారంభించారు. కృత్రిమ మేధ ఆధారిత సమావేశ వ్యవస్థ, నేర విశ్లేషణ, సమాచార నిర్వహణ వ్యవస్థలను దర్యాప్తులో ఉపయోగించేలా చర్యలు చేపట్టారు. జూన్ 13న పోలీసు అధికారుల సంక్షేమంపై ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మాసబ్‌ట్యాంక్‌లోని పోలీసు అధికారుల మెస్‌ను పరిశీలించి వసతి, వ్యాయామశాల, ఈత కొలను, సమావేశ మందిరాలు తదితర సదుపాయాలను మెరుగుపరచాలని ఆదేశించారు. జూన్ 15న ముఖ్యమంత్రి నిర్వహించిన ప్రజా పాలన--99 రోజుల ప్రగతి ప్రణాళిక సమీక్షలో పోలీసు శాఖ చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. రోడ్డు భద్రతకు సంబంధించిన 'అరైవ్ అలైవ్', మహిళలు-పిల్లల భద్రత, మాదకద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాలను మూడు ప్రధాన కార్యక్రమాలుగా వివరించారు. జూన్ 16న హైదరాబాద్‌లో భారీ వర్షాలు, ముంపు పరిస్థితులపై పోలీసు శాఖను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలు, ప్రధాన ట్రాఫిక్ కూడళ్లను నిరంతరం పర్యవేక్షించాలని, జీహెచ్ఎంసీ, హైడ్రా, నీటిపారుదల తదితర శాఖలతో సమన్వయంతో పనిచేయాలని అధికారులను ఆదేశించారు. జూన్ 17న మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించారు. ప్రజలకు పోలీస్ కమిషనర్ మరింత అందుబాటులో ఉండేలా ఈ కార్యాలయాన్ని ఏర్పాటు చేశారు. మల్కాజిగిరి, ఉప్పల్ జోన్ల పరిధిలోని 11 పోలీస్ స్టేషన్ల పరిపాలనా సమన్వయాన్ని సులభతరం చేయడం దీని లక్ష్యం. జూన్ 19న పాస్‌పోర్టు ధ్రువీకరణ సేవల్లో వేగవంతమైన, సాంకేతికత ఆధారిత సేవలకు తెలంగాణ పోలీస్ శాఖకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 2025--26 సంవత్సరంలో సుమారు 99 శాతం పాస్‌పోర్టు ధ్రువీకరణలు సగటున 5 నుంచి 7 రోజుల్లో పూర్తి చేసినట్లు పోలీసు శాఖ వెల్లడించింది. జూన్ 20న పోలీసుల శారీరక, మానసిక ఆరోగ్యంపై డీజీపీ ప్రత్యేక దృష్టి సారించారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది రోజూ కనీసం గంటసేపు శారీరక వ్యాయామం చేయాలని సూచించారు. పోలీసు శాఖలో ఫిట్‌నెస్ కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే దిశగా చర్యలు చేపట్టారు. జూన్ 22 నుంచి 26 వరకు రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించారు. పాఠశాలలు, కళాశాలలు, విద్యాసంస్థలు, ప్రభుత్వ శాఖలు, సామాజిక సంస్థల భాగస్వామ్యంతో యువతను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేలా ప్రచారం నిర్వహించారు. జూన్ 24న మహంకాళి బోనాల ఉత్సవాల భద్రతపై ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. భక్తుల రద్దీ, ట్రాఫిక్, శాంతిభద్రతలు, భద్రతా ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. జూన్ 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవాన్ని పురస్కరించుకుని డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం భారీ అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రభుత్వం, పోలీసులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, యువత సమష్టిగా పనిచేయాలని పిలుపునిచ్చారు. జూన్ 29న పోలీసు శాఖలో క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేశారు. పోలీసు బదిలీలు, పోస్టింగ్స్‌తో పాటు జోనల్ డీఐజీల పర్యవేక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసి జిల్లాల పోలీసింగ్‌పై ఉన్నతాధికారుల పర్యవేక్షణ పెంచే చర్యలు చేపట్టారు. జూన్ 30న తెలంగాణ ప్రత్యేక పోలీసు బెటాలియన్లపై సమీక్ష నిర్వహించారు. శాంతిభద్రతలు, ఎన్నికల భద్రత, విపత్తుల సమయంలో స్పందన, వీఐపీ భద్రత, ప్రత్యేక ఆపరేషన్ల సామర్థ్యాలను మరింత ఆధునీకరించాలని ఆదేశించారు. జూలై 3న రాష్ట్రస్థాయి పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించి నేర, పోలీసింగ్ వ్యవస్థలో కనిపించేలా పోలీసింగ్ కొనసాగించాలని సూచించారు. నేర, నేరస్థుల సమాచార వ్యవస్థ, క్షేత్రస్థాయి పర్యటనలు, పోలీస్ స్టేషన్ల తనిఖీలు, వాహన తనిఖీలు, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాలు, రోడ్డు భద్రత వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. జూలై 7న భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ప్రారంభించారు. ఆధునిక సదుపాయాలతో పాటు చిన్నస్థాయి కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. నేర, నేరస్థుల సమాచార వ్యవస్థలో నాణ్యమైన సమాచారాన్ని నమోదు చేయాలని అధికారులకు సూచించారు. జూలై 8న సారూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో 5వ తెలంగాణ రాష్ట్ర పోలీస్ క్రీడా పోటీలను ప్రారంభించారు. రాష్ట్ర పోలీసు క్రీడలను తొలిసారిగా ఐదు క్లస్టర్లుగా నిర్వహించే విధానానికి శ్రీకారం చుట్టారు. పోలీసుల శారీరక దృఢత్వం, మానసిక ఆరోగ్యం, క్రీడా ప్రతిభను పెంచడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. జూలైలో పోలీసు సిబ్బంది, వారి కుటుంబాల సంక్షేమంపై కూడా ప్రత్యేక దృష్టి కొనసాగింది. వివాహ రుణాలు, వైద్య రుణాలు, విద్యా రుణాలు, ప్రతిభా ఉపకార వేతనాలు, బీమా, ఆరోగ్య రక్షణ వంటి సంక్షేమ పథకాల అమలును సమీక్షించారు. 2026 జూన్ వరకు ఆరోగ్య రక్షణ పథకం ద్వారా 12,392 మంది లబ్ధి పొందినట్లు డీజీపీ కార్యాలయం వెల్లడించింది.

### సాంకేతికతే భవిష్యత్ పోలీసింగ్‌కు బలం..

మే 1 నుంచి ఆగస్టు 18 వరకు సీవీ ఆనంద్ చేపట్టిన చర్యలను పరిశీలిస్తే తెలంగాణ పోలీసింగ్‌లో సాంకేతికత ఆధారిత మార్పులకు ఆయన అత్యధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు స్పష్టమవుతోంది. కృత్రిమ మేధ, డ్రోన్లు, సీసీ కెమెరాలు, కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాలు, నేర విశ్లేషణ వ్యవస్థలు, సైబర్ ప్రయోగశాలలు, సమాచార నిర్వహణ వ్యవస్థల వినియోగాన్ని విస్తరించే దిశగా చర్యలు చేపట్టారు.

### డ్రగ్స్ పై ఉక్కుపాదం


మాదకద్రవ్యాల నియంత్రణను రాష్ట్ర పోలీసు శాఖలో అత్యంత కీలక అంశంగా మార్చారు. విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్ కమిటీలు, యాంటీ డ్రగ్--సేఫ్టీ క్లబ్బులు, రాష్ట్రవ్యాప్త అవగాహన కార్యక్రమాలు, యువతకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాల ద్వారా డ్రగ్స్ రహిత తెలంగాణ లక్ష్యంగా చర్యలు కొనసాగిస్తున్నారు.

### రోడ్డు భద్రతకు ప్రత్యేక ప్రాధాన్యం

రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నిర్వహణను మెరుగుపరచడం కోసం ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా చర్యలు చేపట్టారు. 'అరైవ్ అలైవ్' కార్యక్రమం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంచడం, ప్రమాదకర ప్రాంతాలను గుర్తించడం, సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాఫిక్‌ను పర్యవేక్షించడం వంటి చర్యలకు ప్రాధాన్యం ఇచ్చారు.

### పోలీసుల సంక్షేమం కూడా కీలకమే

పోలీసులు విధి నిర్వహణలో సమర్థంగా పనిచేయాలంటే వారి ఆరోగ్యం, మానసిక స్థైర్యం, కుటుంబ సంక్షేమం కూడా ముఖ్యమని డీజీపీ భావిస్తున్నారు. అందులో భాగంగానే ఫిట్‌నెస్, వ్యాయామం, వైద్య సదుపాయాలు, రుణాలు, విద్యా ఉపకార వేతనాలు, బీమా, ఆరోగ్య రక్షణ పథకాలపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మొత్తంగా సీవీ ఆనంద్ డీజీపీగా బాధ్యతలు చేపట్టిన తొలి మూడు నెలలకు పైగా కాలంలో తెలంగాణ పోలీసు శాఖకు శాంతిభద్రతలు, మాదకద్రవ్యాల నియంత్రణ, సైబర్ నేరాల కట్టడి, కృత్రిమ మేధ-సాంకేతిక ఆధారిత పోలీసింగ్, రోడ్డు భద్రత, మహిళలు--పిల్లల రక్షణ, కనిపించే పోలీసింగ్, పోలీస్ స్టేషన్ల ఆధునీకరణ, సీసీ కెమెరాలు--కమాండ్ కంట్రోల్ వ్యవస్థలు, ప్రత్యేక విభాగాల పునర్వ్యవస్థీకరణ, పోలీసుల ఆరోగ్యం-సంక్షేమం, ప్రజలకు అందుబాటులో ఉండే పోలీసింగ్ వంటి అంశాలను ప్రధాన కార్యాచరణగా నిర్దేశించారు. మే 1 నుంచి ఆగస్టు 18 వరకు జరిగిన ఈ పరిణామాలు తెలంగాణ పోలీసింగ్‌ను సంప్రదాయ విధానాల నుంచి సాంకేతికత, ప్రజా భద్రత, సమర్థవంతమైన సేవల వైపు మరింతగా తీసుకెళ్లే ప్రయత్నంగా నిలిచాయి.



# 700 మందికి పైగా న్యాయవాదుల డిమాండ్

**బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఛైర్మన్ రాజీనామా చేయాలి**
**నల్సార్ విద్యార్థుల వివాదంలో మానన్ కుమార్ మిశ్రాపై పెరుగుతున్న ఒత్తిడి**
**రాజీనామా చేయకపోతే అవిశ్వాస తీర్మానం తీసుకురావాలని న్యాయవాదుల సంఘాల డిమాండ్**
**విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నిలిపివేత నిర్ణయంపై చట్టపరమైన సమీక్షకు డిమాండ్**
**విద్యార్థుల అభిప్రాయ స్వేచ్ఛను అణచివేయడం సరికాదని స్పష్టం**

**హైదరాబాద్, ఆగస్టు 18 (జై భీమ్ న్యూస్):**

హైదరాబాద్‌లోని నల్సార్ యూనివర్సిటీ ఆఫ్ లా విద్యార్థుల వివాదం మరో కీలక మలుపు తిరిగింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బీసీఐ) ఛైర్మన్ మానన్ కుమార్ మిశ్రా రాజీనామా చేయాలని 700 మందికి పైగా సభ్యులున్న మూడు న్యాయవాదుల సంఘాలు డిమాండ్ చేశాయి. ఆయన పదవి నుంచి తప్పుకోకపోతే బీసీఐలోని ఇతర సభ్యులు అవిశ్వాస తీర్మానం తీసుకురావాలని కోరాయి. నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థులు తమ కాన్వొకేషన్‌కు భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్‌ను ఆహ్వానించడంపై అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఈ వివాదం ప్రారంభమైంది. విద్యార్థుల నిరసన నేపథ్యంలో 2026లో నల్సార్ నుంచి పట్టభద్రులయ్యే విద్యార్థులను రాష్ట్ర బార్ కౌన్సిళ్లలో న్యాయవాదులుగా నమోదు చేయకూడదని బీసీఐ ఆదేశాలు జారీ చేయడం తీవ్ర విమర్శలకు దారితీసింది. అనంతరం ఆ ఆదేశాలను బీసీఐ ఉపసంహరించుకుంది. వివాదం తీవ్రం కావడంతో బీసీఐ ఛైర్మన్ మానన్ కుమార్ మిశ్రా విద్యార్థులకు క్షమాపణలు తెలిపారు. విద్యార్థుల మనోభావాలు దెబ్బతిన్నట్లయితే చింతిస్తున్నానని ఆగస్టు 15న వెల్లడించారు.

**సుప్రీంకోర్టు దృష్టికి వ్యవహారం**

నల్సార్ విద్యార్థుల వ్యవహారం సుప్రీంకోర్టు దృష్టికి కూడా వెళ్లింది. విద్యార్థులపై తీసుకున్న చర్యలపై కోర్టు తీవ్రంగా స్పందించినట్లు నివేదికలు వెల్లడించాయి. విద్యార్థులకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే హక్కు ఉందని స్పష్టం చేస్తూ, నల్సార్ విద్యార్థులు లేదా అధ్యాపకులపై బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలు జారీ చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ ఫర్ జస్టిస్, నేషనల్ అలయన్స్ ఫర్ జస్టిస్ అకౌంటబిలిటీ అండ్ రైట్స్, క్వీర్ లాయర్స్ అసోసియేషన్ అనే మూడు న్యాయవాదుల సంఘాలు మానన్ కుమార్ మిశ్రా తక్షణమే బీసీఐ ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశాయి.

**నిర్ణయ ప్రక్రియపై సమీక్షకు డిమాండ్**

నల్సార్ విద్యార్థుల బార్ ఎన్‌రోల్‌మెంట్‌కు సంబంధించి బీసీఐ తీసుకున్న నిర్ణయానికి ఉన్న చట్టపరమైన అధికారం, అనుసరించిన విధానం, నిర్ణయం తీసుకున్న ప్రక్రియను పూర్తిగా సమీక్షించాలని న్యాయవాదుల సంఘాలు కోరాయి. న్యాయ వృత్తి స్వతంత్రత, సమగ్రత, స్వయంప్రతిపత్తిని కాపాడాల్సిన బాధ్యత నియంత్రణ సంస్థలపై ఉందని పేర్కొన్నాయి. ప్రజాస్వామ్యంలో అన్యాయంగా అనిపించిన అంశాలను ప్రశ్నించే హక్కు ప్రతి ఒక్కరికీ ఉంటుందని, ముఖ్యంగా న్యాయ విద్యార్థుల అభిప్రాయ స్వేచ్ఛను గౌరవించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశాయి.

**న్యాయవర్గాల్లో కొనసాగుతున్న చర్చ**

ఒక విశ్వవిద్యాలయానికి చెందిన విద్యార్థులు కాన్వొకేషన్‌లో ముఖ్య అతిథి విషయంలో తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేసినందుకు మొత్తం 2026 బ్యాచ్ విద్యార్థుల భవిష్యత్తును ప్రభావితం చేసేలా బార్ ఎన్‌రోల్‌మెంట్‌ను నిలిపివేయడం సమంజసమేనా? అనే ప్రశ్న న్యాయవర్గాల్లో చర్చకు దారితీసింది. మొదట ఆదేశాలు జారీ చేసి, అనంతరం వాటిని ఉపసంహరించుకోవడం, ఆ తర్వాత ఛైర్మన్ క్షమాపణలు చెప్పడం జరిగినప్పటికీ.. అసలు ఆ నిర్ణయం ఎందుకు తీసుకున్నారు? దానికి చట్టపరమైన ఆధారం ఏమిటి? నిర్ణయం తీసుకునే ముందు సరైన



విధానాన్ని అనుసరించారా? అనే ప్రశ్నలు ఇంకా కొనసాగుతున్నాయి. నల్సార్ పూర్వ విద్యార్థులు కూడా ఉపసంహరించుకున్న బీసీఐ ఉత్తర్వు చట్టబద్ధతను సుప్రీంకోర్టులో ప్రశ్నించినట్లు సమాచారం.

**ఇతర న్యాయ విద్యాసంస్థల్లోనూ చర్చ**

ఈ వివాదం నల్సార్‌కే పరిమితం కాకుండా ఇతర న్యాయ విద్యాసంస్థలకు కూడా విస్తరిస్తుందా అనే చర్చ మొదలైంది. బెంగళూరులోని నేషనల్ లా స్కూల్ ఆఫ్ ఇండియా యూనివర్సిటీకి చెందిన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు కూడా సూర్యకాంత్, మానన్ కుమార్ మిశ్రా హాజరుపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు వెలువడ్డాయి. దీంతో నల్సార్ విద్యార్థులకు మరిన్ని విశ్వవిద్యాలయాలు, న్యాయ విద్యార్థులు సంఘీభావం ప్రకటిస్తారా? బీసీఐ నాయకత్వంపై విమర్శలు మరింత పెరుగుతాయా? మానన్ కుమార్ మిశ్రా రాజీనామా డిమాండ్‌పై బీసీఐలో ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి? అనే అంశాలు ఆసక్తికరంగా మారాయి. మొత్తంగా ఈ వ్యవహారం కేవలం నల్సార్ విద్యార్థులు--బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మధ్య వివాదంగా కాకుండా విద్యార్థుల అభిప్రాయ స్వేచ్ఛ, నిరసన హక్కు, న్యాయ వృత్తి స్వతంత్రత, నియంత్రణ సంస్థల అధికార పరిమితులు, సంస్థాగత జవాబుదారీతనం వంటి కీలక అంశాలను తెరపైకి తెచ్చింది.

# రాష్ట్ర వ్యాప్తంగా విజయవంతంగా మండలస్థాయి ప్రజావాణి

**565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో నిర్వహణ**
**మొత్తం 5,410 వినతుల స్వీకరణ ..10,753 మంది అధికారుల హాజరు**
**జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలోనూ ప్రజావాణి**
**ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి వెల్లడి**


**హైదరాబాద్,ఆగస్ట్17(జై భీమ్ న్యూస్):**

రాష్ట్ర వ్యాప్తంగా సోమవారం మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతమైంది. ప్రజల సమస్యలను వారి మండల స్థాయిలోనే నేరుగా స్వీకరించి, వాటికి పరిష్కారం చూపించాలనే ఉద్దేశంతో రాష్ట్రంలోని అన్ని మండలాల్లో ప్రజావాణి కార్యక్రమాన్ని సోమవారం ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. రాష్ట్రంలోని మొత్తం 565 మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో మండల స్థాయి ప్రజావాణి నిర్వహించగా, సంగారెడ్డి జిల్లాలోని జిన్నారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో కూడా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. దీంతో రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు నిర్వహించినట్లయిందని ప్రజావాణి రాష్ట్ర ఇంచార్జ్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి కే. విద్యాసాగర్ తెలిపారు. మండల స్థాయి ప్రజావాణికి రాష్ట్ర వ్యాప్తంగా ప్రజల నుంచి మొత్తం 5,410 వినతులు (పిటిషన్లు) అందాయి. ప్రజలు తమ సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి, వాటి పరిష్కారం కోసం వినతులను సమర్పించారు. ప్రజల నుంచి వచ్చిన ప్రతి వినతిని అధికారులు స్వీకరించి, సమస్య స్వభావాన్ని పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకునే విధంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. మండల ప్రజావాణి కోసం అధికారులు శాఖ వారిగా డెస్క్ లు, హెల్ప్ డెస్క్ ను, మంచినీటి సౌకర్యాలు కల్పించారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలకు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 10,753 మంది అధికారులు హాజరయ్యారు. ప్రజలు సమర్పించిన వినతులను నేరుగా స్వీకరించడంతో పాటు, ఆయా సమస్యలకు సంబంధించిన వివరాలను తెలుసుకుని పరిష్కారానికి అవసరమైన చర్యలపై అధికారులు దృష్టి సారించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఒక జిల్లాకు సగటున 164 వినతులు అందాయి. జిల్లాల వారీగా అత్యధికంగా వినతులు అందిన జిల్లాగా కరీంనగర్ జిల్లా నిలిచింది. కరీంనగర్ జిల్లాలో మొత్తం 704 వినతులు స్వీకరించబడ్డాయి. అలాగే, ఒక మండలానికి సగటున అత్యధిక వినతులు అందిన జిల్లాగా కూడా కరీంనగర్ జిల్లా ముందంజలో ఉంది. కరీంనగర్ జిల్లాలో ఒక్కో మండలానికి సగటున 47 వినతులు అందాయి. మండల స్థాయిలోనే ప్రజల నుంచి నేరుగా వినతులను స్వీకరించడం ద్వారా సమస్యల పరిష్కార పక్రియను ప్రజలకు మరింత చేరువ చేయడం సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం జిల్లా లేదా రాష్ట్ర స్థాయి కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా, స్థానిక స్థాయిలోనే సంబంధిత అధికారులకు తమ సమస్యలను వివరించే అవకాశం మండల స్థాయి ప్రజావాణి ద్వారా లభించింది. ÷-రజల నుంచి వచ్చిన వినతులను సంబంధిత శాఖలకు పంపించి, వాటిని పరిశీలించి, సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోనున్నారు. మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి, అధికారుల నుంచి విశేష స్పందన లభించింది. పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి వినతులు సమర్పించగా, అధికారులు కూడా ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేశారు. కొత్తంగా రాష్ట్రవ్యాప్తంగా 566 మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించబడి, 5,410 వినతులు స్వీకరించబడ్డాయి. ప్రజలు మరియు అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మండల స్థాయి ప్రజావాణి కార్యక్రమం విజయవంతంగా కొనసాగింది.

# పాలిటెక్నిక్ కళాశాలలను ఇతర శాఖల పరిధిలోకి మార్చొద్దు

**సాంకేతిక విద్యా మండలి పరిధిలోనే కొనసాగించాలి**
**హనుమకొండ కలెక్టర్‌కు ప్రజాతంత్ర విద్యార్థి సంఘం వినతి**






**వరంగల్, 17 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

రాష్ట్రంలోని పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో పాటు ఇతర శాఖల పరిధిలోకి మార్చే ప్రతిపాదనలను ఉపసంహరించు కోవాలని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ డిమాండ్ చేసింది. ఈ మేరకు సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 97లో పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ పరిధిలోకి తీసుకురావాలని పేర్కొనడాన్ని వారు వ్యతిరేకించారు. పాలిటెక్నిక్ కళాశాలలను తెలంగాణ రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి పరిధిలోనే కొనసాగించాలని కోరారు. పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని సాంకేతిక విద్యా మండలిని మరింత బలోపేతం చేయాలని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలల్లో ప్రయోగశాలలు, పనిముట్ల శాలలు, తరగతి గదులు, వసతి గృహాలు తదితర మౌలిక వసతులను మెరుగుపరచాలని కోరారు. విద్యార్థుల విద్యా భవిష్యత్తుకు సంబంధించిన కీలక నిర్ణయాలను విద్యార్థులు, అధ్యాపకులు, విద్యా నిపుణులతో చర్చించిన తర్వాతే అమలు చేయాలని స్పష్టం చేశారు.

**ప్రధాన డిమాండ్లు:**

1. పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ లేదా ఇతర శాఖల పరిధిలోకి బదిలీ చేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.
2. పాలిటెక్నిక్ కళాశాలలను సాంకేతిక విద్యా మండలి పరిధిలోనే కొనసాగించాలి.
3. ఖాళీగా ఉన్న అధ్యాపక, బోధనేతర పోస్టులను వెంటనే భర్తీ చేయాలి.
4. కళాశాలల్లో మౌలిక వసతులను మెరుగుపరచాలి.
5. విద్యార్థులకు సంబంధించిన నిర్ణయాలను వారి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అమలు చేయాలి.

ఈ కార్యక్రమంలో జస్వంత్, వినీత్, దర్శిత్, చరణ్, రుషిత్, రామ్ చరణ్ తదితరులు పాల్గొన్నారు. "పాలిటెక్నిక్ విద్యను కాపాడాలి - సాంకేతిక విద్యా మండలిని బలోపేతం చేయాలి" అని అఖిల భారత ప్రజాతంత్ర విద్యార్థి సంఘం నాయకులు డిమాండ్ చేశారు.


## జిల్లా ఉత్తమ ఫార్మసీ అధికారిగా గాదెలవర్తి రాణి రత్నప్రభకు ఘన సత్కారం



**బాపట్ల జిల్లా(జై భీమ్ న్యూస్)**

బాపట్ల జిల్లా కొల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసీ అధికారిగా విధులు నిర్వహిస్తున్న గాదెలవర్తి రాణి రత్నప్రభకు 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అరుదైన గౌరవం లభించింది. శనివారం బాపట్లలో నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జిల్లా ఉత్తమ ఫార్మసీ అధికారిగా రాణి రత్నప్రభను ఎంపిక చేసి ప్రశంసా పత్రంతో సత్కరించారు. ఈ ప్రశంసా పత్రాన్ని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చేతుల మీదుగా ఆమె అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఐఏఎస్, జిల్లా పోలీసు అధికారి బి. ఉమా మహేశ్వర్, ఐపీఎస్, వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ తదితరులు పాల్గొన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో అంకితభావంతో విధులు నిర్వహిస్తూ, ఫార్మసీ విభాగంలో ఉత్తమ సేవలు అందించినందుకు రాణి రత్నప్రభను జిల్లా ఉత్తమ ఫార్మసీ అధికారిగా ఎంపిక చేశారు. ఈ సందర్భంగా అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్ తరపున రాణి రత్నప్రభకు వ్యవస్థాపకులు ఆళ్ళమూడి ప్రభాకరరావు హృదయపూర్వక అభినందనలు తెలిపారు. అలాగే ఈ గౌరవానికి రాణి రత్నప్రభను ఎంపిక చేసిన వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, ఐఏఎస్లకు ఆళ్ళమూడి ప్రభాకరరావు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. - ఆళ్ళమూడి ప్రభాకరరావు, వ్యవస్థాపకులు, అంబేద్కర్ చారిటబుల్ ట్రస్ట్, జాతీయ సమన్వయకర్త, ఎస్సీ-ఎస్టీ అధికారుల వేదిక, మాజీ నాయకులు, ఎంఆర్‌పీఎస్, ఎంఈఎఫ్, తెనాలి / విశాఖపట్నం.

## పంచాయతీ కార్యాలయంలో గ్రామస్తుడిపై చెప్పుతో దాడి ఆరోపణలు




**పర్వతగిరి, 17 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

పంచాయతీ కార్యాలయ ఆవరణలో గ్రామస్తుడిపై చెప్పుతో దాడి చేసిన ఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కల్లెడ గ్రామ మాజీ సర్పంచ్ చిన్నపాక శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆగస్టు 5వ తేదీ బుధవారం ఉదయం సుమారు 7:30 గంటల సమయంలో కల్లెడ గ్రామ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యుల సమక్షంలో ఉపసర్పంచ్ దొమ్మటి సమ్మయ్య అలియాస్ కొమురయ్య ఓ గ్రామస్తుడిపై చెప్పుతో దాడి చేసినట్లు సోషల్ మీడియా, వార్తా కథనాల ద్వారా తనకు సమాచారం అందిందని శ్రీనివాస్ తెలిపారు. ప్రజలకు సేవలందించే గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఇటువంటి ఘటన జరగడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. ఈ ఘటనతో గ్రామస్తుడి హక్కులకు భంగం కలిగిందని ఆరోపించారు. ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి, ఘటనకు సంబంధించిన వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని కోరుతూ పర్వతగిరి మండల పంచాయతీ అధికారికి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారు. పంచాయతీరాజ్ చట్టం ప్రకారం బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని, ఆరోపణలు నిజమని తేలితే ఉపసర్పంచ్ పదవి నుంచి తొలగించే చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

## 16 ఏళ్ల వయసులో లక్ష్మన్ సిఎ పూర్తి

**భారతీయ టీనేజర్ గిన్నిస్ రికార్డు**

న్యూఢిల్లీ,ఆగస్ట్17(జై భీమ్ న్యూస్): పదహారేళ్ల వయసులో టీనేజర్లు తాము ఏ రంగాన్ని ఎంచుకోవాలో తెలియక మల్లగుల్లాలు పడుతుంటారు. కానీ ఓ భారతీయ టీనేజర్ మాత్రం తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకోవడమే కాకుండా అందులో గిన్నిస్ రికార్డు కూడా సృష్టించాడు. ప్రస్తుతం దుబాయ్‌లో ఉంటున్న లక్ష్మణన్ మేయప్పన్ అత్యంత పిన్నవయస్కుడైన సీఏగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో తాజాగా చోటు సంపాదించాడు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అతడికీ అరుదైన గుర్తింపు లభించింది. ప్రస్తుతం మేయప్పన్ సెంచరీ ÷నాన్షియల్ అనే సంస్థలో సీనియర్ ÷నాన్షియల్ రీసెర్చ్ ఎనలిస్టుగా ఉన్నాడు. అతడి అసాధారణ ప్రజ్ఞ గురించి కంపెనీ స్వయంగా ప్రకటించింది. కొవిడ్ సమయంలో అకౌంటింగ్‌పై మేయప్పన్‌కు మక్కువ ఏర్పడింది. స్వయంగా సీఏ అయిన అతడి తల్లి అకౌంటింగ్‌కు సంబంధించిన ప్రాథమిక అంశాలను తనయుడికి పరిచయం చేయడంతో ఆసక్తి ఏర్పడింది. దీంతో, తాను ఏసీసీఏ పరీక్షలు పాసై సీఏ కావాలని నిర్ణయించుకున్నాడు. 10వ తరగతి పరీక్షల తరువాత ఏడాది పాటు కష్టపడి 2021లో ఏసీసీఏ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. కేవలం 16 ఏళ్ల 141 రోజులు చిరు ప్రాయంలోనే అకౌంటెంట్‌గా మారాడు. తనకు గిన్నిస్ రికార్డుల్లో చోటు దక్కడంపై మేయప్పన్ హర్షం వ్యక్తం చేశాడు. 'ఇది నాకెంతో విలువైనది. చదువు అనేది నేనెప్పుడు ఒక రేసులా భావించలేదు. అర్థికరంగాన్ని అర్థం చేసుకునేందుకే ప్రాథాన్యం ఇచ్చాను. అన్ని కాలాలకు అనువైన నైపుణ్యాలను నేర్చుకోవడంపై దృష్టిపెట్టాను. ఆసక్తితో ఏదైనా నేర్చుకుంటే ఫలితాలు అర్థవంతంగా ఉంటాయి' అని అన్నాడు.

జై భీమ్ POWER OF PEOPLE Jai Bheem

# కష్టాల బాట నుంచి ప్రజల గొంతుకగా..

**డాక్టర్ బరిగెల శివ జీవన ప్రస్థానం.. అంబేద్కర్ ఆశయాలే ఆయుధంగా సాగుతున్న ఓ సామాజిక యోధుడి కథ**
**కష్టాలను జయించి.. ప్రజల సమస్యల కోసం ప్రశ్నిస్తూ..**
**సామాజిక న్యాయం కోసం గళమెత్తుతున్న డాక్టర్ బరిగెల శివ ప్రస్థానం**

**జై భీమ్ న్యూస్ - ప్రత్యేక కథనం**

కొంతమంది జీవితంలో ఎదురయ్యే కష్టాలను చూసి వెనక్కి తగ్గుతారు.. మరికొందరు అదే కష్టాలను తమ బలంగా మార్చుకుని ముందుకు సాగుతారు. సమాజంలో కనిపించే అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండకుండా.. దాని వెనుక ఉన్న కారణాలను ప్రశ్నిస్తూ.. ప్రజల తరపున నిలబడే వ్యక్తిగా తన ప్రయాణాన్ని కొనసాగిస్తున్న వారిలో డాక్టర్ బరిగెల శివ ఒకరు. ఒక సాధారణ వ్యక్తిగా ప్రారంభమైన ఆయన ప్రయాణం.. నేడు జై భీమ్ టీవీ ఇండియా వ్యవస్థాపకుడు, ఛైర్మన్, సీఈఓ స్థాయికి చేరుకుంది. ఈ ప్రయాణం కేవలం ఒక మీడియా సంస్థను నిర్మించిన కథ కాదు. ప్రజల సమస్యలను ప్రజల ముందుకు తీసుకురావాలనే సంకల్పం.. సామాజిక న్యాయం కోసం ప్రశ్నించాలనే తపన.. అంబేద్కర్ ఆలోచనా విధానాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే లక్ష్యంతో సాగిన ప్రయాణం.

**కష్టాలు ఎదురైనా.. అడుగు వెనక్కి వేయలేదు**

జీవితంలో ఒక స్థాయికి చేరుకోవడం అంత సులభం కాదు. ముఖ్యంగా సామాజిక సమస్యలపై మాట్లాడే వ్యక్తికి ఎన్నో సవాళు ఎదురవుతాయి. విమర్శలు ఉంటాయి.. వ్యతిరేకత ఉంటుంది.. ఆర్థిక ఇబ్బందులు ఉంటాయి.. ఎన్నో సందర్భాల్లో ఒంటరిగా నిలబడాల్సి వస్తుంది. అలాంటి పరిస్థితులను అధిగమిస్తూ డాక్టర్ బరిగెల శివ తన ప్రయాణాన్ని కొనసాగించారు. తనకు ఎదురైన కష్టాలను అడ్డంకులుగా కాకుండా.. తన లక్ష్యానికి చేరుకునే మెట్లుగా మార్చుకున్నారు. ఒక వ్యక్తి ఎదగడం మాత్రమే కాదు.. తనతో పాటు సమాజంలోని మరెంతో మందిని ముందుకు తీసుకెళ్లాలనే ఆలోచన ఆయన ప్రయాణంలో కనిపిస్తుంది.

**విద్యను ఆయుధంగా మార్చుకున్న ప్రస్థానం**

ప్రజా సమస్యలపై మాట్లాడటంతో పాటు విద్యకు కూడా డాక్టర్ బరిగెల శివ తన ప్రయాణంలో ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చారు. యూపీఎస్సీ, గ్రూప్-1 వంటి పోటీ పరీక్షల దిశగా కూడా ఆయన ప్రయాణించారు. న్యాయ రంగంపై అవగాహన పెంచుకోవాలనే లక్ష్యంతో ఎల్ఎల్‌బీ విద్యను పూర్తి చేశారు. అదే విధంగా ప్రజలకు సమాచారాన్ని చేరవేయడంలో మీడియా పాత్రను మరింత లోతుగా అర్థం చేసుకునేందుకు మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (ఎంసీజే) విద్యను కూడా పూర్తి చేశారు. విద్య, న్యాయ అవగాహన, జర్నలిజం, ప్రజా సమస్యలపై పోరాటం - ఇవన్నీ ఆయన ప్రస్థానంలో పరస్పరం అనుసంధానమైన అంశాలుగా కనిపిస్తున్నాయి.

**పాత్రికేయుడిగా.. ప్రజల సమస్యలకు అద్దంగా**

పాత్రికేయ వృత్తిని కేవలం వార్తలు చెప్పే వృత్తిగా కాకుండా.. సమాజానికి బాధ్యతగా భావించే దృక్పథంతో ఆయన ముందుకు సాగుతున్నారు. పేదల సమస్యలు, అణగారిన వర్గాల సమస్యలు, సామాజిక వివక్ష, మానవ హక్కులు, రాజ్యాంగ హక్కులు వంటి అంశాలను ప్రజల ముందుకు తీసుకురావడంలో మీడియా కీలక పాత్ర పోషించాలనే ఆలోచనతో ఆయన తన మీడియా ప్రయాణాన్ని విస్తరించారు.

**ఎవరూ పట్టించుకోని సమస్యకు గొంతుక కావాలి..**

ఎవరూ ప్రశ్నించని చోట ప్రశ్నించాలి.. బాధితుడి కన్నీటిని వార్తగా మాత్రమే కాకుండా.. న్యాయం కోసం వినిపించే స్వరంగా మార్చాలి.. అనే ఆలోచన ఆయన పాత్రికేయ ప్రయాణానికి పునాది అయింది.

**జై భీమ్ టీవీ.. ఒక మీడియా సంస్థకంటే ఎక్కువ**

ఈ ఆలోచనల నుంచే జై భీమ్ టీవీ ఇండియా రూపుదిద్దుకుంది. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరు, ఆయన సిద్ధాంతాలను స్ఫూర్తిగా తీసుకుని ఏర్పడిన ఈ మీడియా వేదిక ద్వారా సామాజిక న్యాయం, సమానత్వం, మానవ హక్కులు, రాజ్యాంగ పరిరక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన ప్రయత్నిస్తున్నారు. మీడియా అంటే కేవలం అధికారంలో ఉన్నవారి కార్యక్రమాలను చూపించడం కాదని.. సమాజంలో అట్టడుగున ఉన్న వ్యక్తి సమస్యను కూడా సమాన ప్రాధాన్యంతో ప్రజల ముందుకు తీసుకురావాలని ఆయన భావిస్తున్నారు.



అందుకే జై భీమ్ టీవీ ప్రయాణంలో ప్రజా సమస్యలు, సామాజిక చైతన్యం, రాజ్యాంగ విలువలు ప్రధాన అంశాలుగా నిలుస్తున్నాయి.

**అంబేద్కర్‌ను చదవడం నుంచి.. అంబేద్కర్ ఆశయాల కోసం పోరాడే వరకు**

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జీవితం డాక్టర్ బరిగెల శివపై గాఢమైన ప్రభావం చూపిన ఆలోచనా శక్తిగా నిలిచింది. అంబేద్కర్ కేవలం ఒక వ్యక్తి కాదు.. ఒక ఆలోచన. అంబేద్కర్ కేవలం ఒక పేరు కాదు.. ఒక సామాజిక మార్పు దిశ. అంబేద్కర్ కేవలం రాజ్యాంగ నిర్మాత కాదు.. సమానత్వం కోసం పోరాడిన మహనీయుడు. ఈ ఆలోచనను ప్రజల్లోకి తీసుకెళ్లడమే తన బాధ్యతగా డాక్టర్ బరిగెల శివ భావిస్తున్నారు. విద్య.. సంఘటితం.. పోరాటం అనే అంబేద్కర్ స్ఫూర్తిని సమాజంలో మరింత బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉందని ఆయన చెబుతున్నారు.

**రాజ్యాంగ పరిరక్షణ కోసం గళం**

భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం తన బాధ్యతగా భావిస్తూ ఆయన రాజ్యాంగ పరిరక్షణ అంశంపై నిరంతరం గళమెత్తుతున్నారు. రాజ్యాంగం బలహీనపడితే ముందుగా నష్టపోయేది సమాజంలోని బలహీన వర్గాలేననే అభిప్రాయంతో.. రాజ్యాంగ విలువల పరిరక్షణకు ప్రజలు చైతన్యవంతులు కావాలని ఆయన పిలుపునిస్తున్నారు. రాజ్యాంగం గురించి కేవలం సభల్లో మాట్లాడటం కాకుండా.. ప్రతి సామాన్యుడికి తన హక్కులు, బాధ్యతలు తెలియాలని ఆయన కోరుతున్నారు.

**ప్రధానమంత్రి స్థాయి వ్యక్తినైనా ప్రశ్నించడమే ప్రజాస్వామ్యంలో తన హక్కుగా భావించే ధైర్యం**

భారత రాజ్యాంగం సామాన్య పౌరుడికి కల్పించిన హక్కులపై డాక్టర్ బరిగెల శివ ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. దేశ ప్రధానమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి అయినా.. ప్రజల తరపున ప్రశ్నించడం ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడి హక్కు అనే భావనతో ఆయన ముందుకు సాగుతున్నారు. దేశానికి మూడుసార్లు ప్రధానమంత్రిగా సేవలందించిన నరేంద్ర మోదీపై కూడా ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ నియోజకవర్గంలో నామినేషన్ వేసి పోటీ చేసినట్లు ఆయన రాజకీయ ప్రస్థానంలో మరో కీలక అధ్యాయం. అత్యున్నత పదవిలో ఉన్న నాయకుడినైనా ప్రశ్నించడానికి వెనుకాడకపోవడం.. ఎన్నికల బరిలో ఎవరినైనా ఎదుర్కొనే ధైర్యం కలిగి ఉండటం.. ప్రజా సమస్యలపై ఎవరినైనా నిలదీసే సిద్ధాంతంతో ముందుకు సాగడం డాక్టర్ బరిగెల శివ రాజకీయ ప్రయాణంలో ప్రత్యేకతగా ఆయన వర్గాలు పేర్కొంటున్నాయి. ఎవరు ప్రధానమంత్రి అయినా.. ఎవరు ముఖ్యమంత్రి అయినా.. ఎవరు అధికారంలో ఉన్నా.. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిందే అనే ప్రజాస్వామ్య స్ఫూర్తితోనే తాను ప్రశ్నిస్తానని ఆయన చెబుతున్నారు. ప్రజలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, స్వేచ్ఛలు, సమానత్వం, సామాజిక న్యాయం వంటి అంశాలను ప్రజలకు తెలియజేయడం తన బాధ్యతగా భావిస్తున్నారు. రాజ్యాంగం ఇచ్చిన హక్కులను ప్రజలు తెలుసుకున్నప్పుడే వారు తమ హక్కుల కోసం నిలబడగలరని ఆయన అభిప్రాయపడుతున్నారు.

**వారణాసి నుంచి కామారెడ్డి వరకు.. ఎవరినైనా ఎదుర్కొనే ధైర్యం**

డాక్టర్ బరిగెల శివ రాజకీయ ప్రస్థానాన్ని పరిశీలిస్తే.. ఆయన పోటీ చేసిన నియోజకవర్గాలు, ఎదుర్కొన్న రాజకీయ ప్రత్యర్థులు కూడా ఆయన ధైర్యాన్ని ప్రతిబింబిస్తాయని ఆయన అనుచరులు చెబుతున్నారు. వారణాసిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై పోటీ చేయడం.. కామారెడ్డిలో మాజీ ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలపై పోటీ చేయడం.. సాధారణ రాజకీయ ప్రయాణానికి భిన్నమైన నిర్ణయాలుగా ఆయన భావిస్తున్నారు. తనకు పదవి వస్తుందా? ఓటమి ఎదురవుతుందా? అనే లెక్కల కంటే.. ప్రజల తరఫున ఒక ప్రశ్నను రాజకీయ వేదికపై వినిపించడమే ముఖ్యమనే ఆలోచనతో ఎన్నికల బరిలోకి దిగినట్లు ఆయన తన రాజకీయ ప్రయాణం ద్వారా చెబుతున్నారు. "ఎవరు పెద్ద నాయకుడైనా ప్రజల ముందు ప్రశ్నించాల్సిందే.. ప్రజాస్వామ్యంలో ప్రజలే అంతిమ నిర్ణేతలు" అనే భావన ఆయన రాజకీయ ప్రస్థానంలో ప్రధానంగా కనిపిస్తుంది.

**మీడియా నుంచి ప్రజా ఉద్యమం వరకు..**

ఒక పాత్రికేయుడిగా ప్రజల సమస్యలను రాస్తూ, చూపిస్తూ వచ్చిన డాక్టర్ బరిగెల శివ.. ఆ సమస్యలపై ప్రజా వేదికల్లోనూ ప్రశ్నించే స్థాయికి ఎదిగారు. సమాజంలో మార్పు రావాలంటే కేవలం వార్తలు రాయడం సరిపోదని.. అవసరమైన చోట ప్రజల తరఫున నిలబడాల్సిన అవసరం ఉందని ఆయన భావిస్తున్నారు. ఈ ఆలోచనే ఆయనను సామాజిక ఉద్యమాల వైపు మరింతగా తీసుకెళ్లింది.

**ఎన్నికల బరిలోనూ ప్రజా స్వరం**

ప్రజల సమస్యలను మరింత బలంగా పాలనా వ్యవస్థ ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో డాక్టర్ బరిగెల శివ పలు ఎన్నికల్లో పోటీ చేశారు. వరంగల్ (ఎస్సీ) లోక్‌సభ నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయడంతో పాటు.. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి లోక్‌సభ నియోజకవర్గం నుంచి కూడా ఎంపీగా పోటీ చేశారు. అదేవిధంగా ఎమ్మెల్యేగా కూడా ఎన్నికల బరిలో నిలిచారు. కామారెడ్డి నియోజకవర్గంలో అప్పటి ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్ రావు, ప్రస్తుత ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిలపై పోటీ చేసిన రాజకీయ ప్రయాణం కూడా ఆయన ప్రస్థానంలో ప్రత్యేక అధ్యాయంగా నిలిచింది. రాజకీయాల్లోకి రావడం అంటే కేవలం అధికారం లేదా పదవి పొందడం మాత్రమే కాదని.. ప్రజల సమస్యలను నేరుగా పాలనా వ్యవస్థ ముందు ఉంచే అవకాశం కూడా అని ఆయన తన ప్రయాణం ద్వారా చెప్పే ప్రయత్నం చేశారు. ఎన్నికల ఫలితం ఏదైనా.. ప్రజల మధ్య ఉండి ప్రజల సమస్యలపై మాట్లాడటం, పోరాడటం మాత్రం ఆగకూడదనే భావనతో ఆయన ముందుకు సాగుతున్నారు.

**యూపీఎస్సీ నుంచి గ్రూప్-1 వరకు.. పోటీ పరీక్షల దిశలోనూ అడుగులు**

ప్రజా జీవితంతో పాటు ప్రభుత్వ పరిపాలన వ్యవస్థపై అవగాహన పెంచుకోవాలనే ఉద్దేశంతో డాక్టర్ బరిగెల శివ యూపీఎస్సీ, గ్రూప్-1 వంటి ప్రతిష్టాత్మక పోటీ పరీక్షల దిశగా కూడా తన ప్రయాణాన్ని కొనసాగించారు. పోటీ పరీక్షల ద్వారా పరిపాలనా వ్యవస్థలోకి వెళ్లడం ఒక మార్గమైతే.. ప్రజా సమస్యలను మీడియా, సామాజిక ఉద్యమాలు, రాజకీయ వేదికల ద్వారా ప్రజల ముందుకు తీసుకురావడం మరో మార్గంగా ఆయన ఎంచుకున్నట్లు ఆయన ప్రస్థానం తెలియజేస్తోంది.

**న్యాయ విద్యతో.. హక్కులపై మరింత అవగాహన**

ఎల్ఎల్‌బీ పూర్తి చేయడం ద్వారా న్యాయ వ్యవస్థ, రాజ్యాంగం, పౌరుల హక్కులపై తన అవగాహనను మరింత విస్తరించుకున్నారు. సామాన్య ప్రజలకు తమ హక్కులు తెలియడం.. చట్టంపై అవగాహన కలిగి ఉండటం.. అన్యాయం జరిగినప్పుడు చట్టబద్ధమైన మార్గాల్లో ప్రశ్నించడం అవసరమనే భావనతో ఆయన ప్రజా చైతన్య కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. మాస్ కమ్యూనికేషన్.. జర్నలిజం నుంచి మీడియా నాయకత్వం వరకు మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజం (ఎంసీజే) పూర్తి చేయడం ఆయన మీడియా ప్రయాణానికి మరింత బలాన్ని చేకూర్చింది. సమాచారాన్ని ప్రజలకు ఎలా చేరవేయాలి? ప్రజా సమస్యలను ఎలా వెలుగులోకి తీసుకురావాలి? మీడియా ద్వారా సామాజిక చైతన్యాన్ని ఎలా పెంచాలి? అనే అంశాలపై ఆయన తన విద్యా అనుభవాన్ని ఆచరణలోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.

**తన కోసం కాదు.. తనలాంటి వారి కోసం**

డాక్టర్ బరిగెల శివ ప్రయాణంలో ప్రత్యేకంగా కనిపించే అంశం.. వ్యక్తిగత ఎదుగుదలను మాత్రమే లక్ష్యంగా పెట్టుకోకపోవడం. సమాజంలో అవకాశాలు దక్కని వారికి అవకాశం రావాలి. గొంతు లేని వారికి గొంతుక ఉండాలి. అన్యాయానికి గురైన వారికి అండగా నిలిచే వ్యవస్థ ఉండాలి. ప్రతి ఒక్కరికీ రాజ్యాంగం కల్పించిన హక్కులు అందాలి. అనే ఆలోచనల చుట్టూనే ఆయన సామాజిక ప్రయాణం కొనసాగుతోంది.

**ఎదిగిన కొద్దీ బాధ్యత పెరుగుతుంది**

ఈరోజు జై భీమ్ టీవీ ఇండియా వంటి మీడియా సంస్థకు నాయకత్వం వహిస్తున్న స్థాయికి చేరుకున్నప్పటికీ.. తన ప్రయాణం ఇంకా పూర్తికాలేదనే భావనతో డాక్టర్ బరిగెల శివ ముందుకు సాగుతున్నారు. ఒకప్పుడు ఎదురైన కష్టాలు తనను ఆపలేకపోయాయని.. అదే కష్టాలు తనలో మరింత పట్టుదలను పెంచాయని ఆయన జీవన ప్రయాణం చెబుతోంది. కష్టాల నుంచి వచ్చిన వ్యక్తికి.. సామాన్యుడి బాధ అర్థమవుతుంది. ప్రజల మధ్య నుంచి వచ్చిన వ్యక్తికి.. ప్రజల సమస్య విలువ తెలుస్తుంది. అంబేద్కర్ ఆలోచనలను నమ్మిన వ్యక్తికి.. సమానత్వం కోసం పోరాటం ఎంత అవసరమో తెలుస్తుంది.

**యువతకు ఒక సందేశం**

డాక్టర్ బరిగెల శివ ప్రయాణం యువతకు ఒక ముఖ్యమైన సందేశాన్ని ఇస్తుంది. జీవితంలో ఎన్ని కష్టాలు వచ్చినా లక్ష్యాన్ని వదలకూడదు. చదువుకోవాలి. రాజ్యాంగాన్ని తెలుసుకోవాలి. హక్కుల గురించి అవగాహన పెంచుకోవాలి. అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండకూడదు. సమాజం కోసం మన వంతు బాధ్యత నిర్వర్తించాలి. అంబేద్కర్‌ను జయంతి రోజున మాత్రమే గుర్తు చేసుకోవడం కాకుండా.. ఆయన చూపిన మార్గాన్ని జీవితంలో ఆచరించాలనే ఆలోచన సమాజంలో బలపడాలని ఆయన ఆకాంక్షిస్తున్నారు.

**ఇది ముగిసిన కథ కాదు.. కొనసాగుతున్న ప్రయాణం**

డాక్టర్ బరిగెల శివ జీవితం ఒక సాధారణ విజయగాథగా చూడలేం. కష్టాలను ఎదుర్కొంటూ.. విద్యను అభ్యసిస్తూ.. పాత్రికేయుడిగా ఎదిగి.. తన ఆలోచనలకు ఒక మీడియా వేదికను నిర్మించి.. సామాజిక న్యాయం కోసం గళమెత్తి.. రాజ్యాంగ పరిరక్షణ కోసం పోరాడుతూ.. యూపీఎస్సీ, గ్రూప్-1 వంటి పోటీ పరీక్షల దిశగా అడుగులు వేస్తూ.. ఎల్ఎల్‌బీ, ఎంసీజే విద్యను పూర్తి చేసి.. ఎంపీ, ఎమ్మెల్యే ఎన్నికల్లోనూ ప్రజా స్వరం వినిపించేందుకు ప్రయత్నించిన ప్రయాణం ఇది. వారణాసిలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై పోటీ చేసినా.. కామారెడ్డిలో ఇద్దరు ముఖ్యమంత్రులపై పోటీ చేసినా.. తనకు ముఖ్యమైనది వ్యక్తులు కాదని, ప్రజా సమస్యలేనని ఆయన రాజకీయ ప్రస్థానం చెబుతోంది. ప్రధానమంత్రి అయినా.. ముఖ్యమంత్రి అయినా.. అధికారం ఎవరి చేతిలో ఉన్నా.. ప్రజల తరఫున ప్రశ్నించడమే తన హక్కు, బాధ్యత అనే ధైర్యంతో ముందుకు సాగుతున్న వ్యక్తిగా డాక్టర్ బరిగెల శివ తనదైన ముద్ర వేస్తున్నారు.

ఒక వ్యక్తి నుంచి ఒక వేదికగా..

ఒక వేదిక నుంచి ఒక ఉద్యమ ఆలోచనగా..

ఒక ఆలోచన నుంచి సామాజిక చైతన్యంగా..

డాక్టర్ బరిగెల శివ ప్రయాణం కొనసాగుతోంది.

ఆ ప్రయాణానికి మార్గదర్శకం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆలోచన,

ఆ ప్రయాణానికి లక్ష్యం సామాజిక న్యాయం,

ఆ ప్రయాణానికి బలం ప్రజల విశ్వాసం,

ఆ ప్రయాణానికి ఆయుధం భారత రాజ్యాంగం.

కష్టాల నుంచి వచ్చిన వ్యక్తి.. ప్రజల మధ్య నిలిచిన వ్యక్తి..

ప్రజల హక్కుల కోసం ప్రశ్నిస్తున్న వ్యక్తి..

ఎవరు అధికారంలో ఉన్నా ప్రశ్నించేందుకు వెనుకాడని వ్యక్తి..

విద్య, న్యాయం, జర్నలిజం, ప్రజాసేవను తన ప్రయాణంలో భాగం చేసుకున్న వ్యక్తి..

అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలనే సంకల్పంతో సాగుతున్న వ్యక్తి - డాక్టర్ బరిగెల శివ.

జై భీమ్.. జై రాజ్యాంగం.. జై సమానత్వం.

**- రఘు గొర్రెకుంట**
**జై భీమ్ న్యూస్ - పర్వతగిరి.**

## ఎమ్మెల్యేగా ప్రశాంత్ కిషోర్ ప్రమాణం

**పాట్నా,ఆగస్ట్17(జై భీమ్ న్యూస్):**

జన్ సూరజ్ పార్టీ వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్(పీకే) ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం బీహార్ శాసనసభలో స్పీకర్ ప్రేమ్ కుమార్ సమక్షంలో బంకిపూర్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆగస్టు 3వ తేదీన బీహార్‌లోని బంకిపూర్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో పీకే ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. 1995 నుండి బీజేపీ కంచుకోటగా ఉన్న ఈ స్థానాన్ని దక్కించుకున్న పీకే.. బీజేపీకి గట్టి దెబ్బ కొట్టి చరిత్రాత్మక ఎన్నికల రంగ ప్రవేశం చేశారు. ఆ ఎన్నికల్లో మొత్తం 64,151 ఓట్లు సాధించిన పీకే.. బీజేపీకి చెందిన నీరజ్ కుమార్‌ను 19,324 ఓట్ల తేడాతో ఓడించారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ రాజ్యసభకు వెళ్లడంతో.. బంకీపూర్ అసెంబ్లీ సీటు ఖాళీ అయ్యింది. దీంతో ఆ నియోజకవర్గానికి ఉప ఎన్నిక అనివార్యమైంది. ఈ ఎన్నికలో పోటీ చేసిన పీకే.. ఎవరూ ఊహించని రీతిలో విజయం ఢంకా మోగించి.. బిహార్ అసెంబ్లీలో అడుగుపెట్టారు.

## ఎల్‌నినో ప్రభావంతో తీవ్ర వర్షాభావ పరిస్థితులు

**ప్రాజెక్టుకలు వచ్చే నీళ్లు కూడా తగ్గిపోయాయి**
**సాగు,తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి**
**నీటిని పొదుపుగా వాడుకోవడం అవసరం**
**అసెంబ్లీలో సిఎం చంద్రబాబు ప్రకటన**

**అమరావతి,ఆగస్ట్17(జై భీమ్ న్యూస్):**

ఎల్‌నినో ప్రభావంతో ఎక్కడ చూసినా తీవ్ర వర్షాభావ పరిస్థితులున్నాయని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. ఈసారి ప్రాజెక్టులకు వచ్చే నీళ్లు కూడా తగ్గిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పైనుంచి నీళ్లు రాకుంటే శ్రీశైలం, నాగార్జున సాగర్‌పై తీవ్ర ప్రభావం ఉంటుందన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ.. ముందుజాగ్రత్త వహించి నీటిని పొదుపుగా వాడి పలు ప్రాజెక్టుల్లో నీరు నిల్వ చేసుకున్నామన్నారు. ప్రస్తుతం పెద్ద ప్రాజెక్టుల్లో 586 టీఎంసీల నీళ్లు ఉన్నాయని తెలిపారు. గోదావరి డెల్టా తప్ప ఎక్కడ వరిపంట వేసినా ఇబ్బందులు వస్తాయి. నీళ్లు లేక పంటలు ఎండిపోయే పరిస్థితులు రావొచ్చు. నీటి విడుదలలో తాగునీటికి, పరిశ్రమలకు ప్రాధాన్యత ఇస్తున్నాం. కర్నూలు జిల్లాలో ఈసారి ఉల్లి సాగు తగ్గవచ్చు. నీటిని తక్కువగా తీసుకునే పంటలను ప్రోత్సహిస్తున్నాం. ఎమ్మెల్యేలు, మంత్రులు వారి ప్రాంతాల్లో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించాలి. రైతుల నుంచి వచ్చే పంటలబీమా దరఖాస్తులు పెరిగాయి. పంటలబీమాలో దేశంలోనే ఐదో స్థానంలో ఉండటం మనకు గర్వకారణం'అని చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉందని, వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. సాధారణ వర్షపాతం కంటే తీవ్రమైన లోటు కనిపిస్తోందని చెప్పారు. సోమవారం అసెంబ్లీలో ఎల్‌నినోపై చర్చ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. అసెంబ్లీ వేదికగా ఎల్‌నినో విషయమై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. కావేరి జలాల విషయంలో తమిళనాడు-కర్ణాటక మధ్య జరుగుతున్న వివాదంలో సుప్రీం కూడా జోక్యం చేసుకుందని తెలిపారు. 'గ్రామాల మధ్య, రాష్ట్రాల మధ్య, దేశాల మధ్య కూడా నీటి సమస్యలు వస్తున్నాయి. 2026 జూన్-డిసెంబర్ వరకు 867 మిల్లీ మీటర్ల వర్షపాతం పడాల్సి ఉంటే.. కేవలం 557 మి.మీ వర్షపాతం మాత్రమే నమోదవుతుందని ఓ అంచనా. ఈ ఏడాది అన్ని జిల్లాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదు కానుంది. కొన్ని జిల్లాల్లో జులై నెలలో 68 శాతం లోటు వర్షపాతం నమోదైంది. ఆగస్టు నెలలో 35 శాతం, సెప్టెంబర్ నెలలో 35 శాతం, అక్టోబర్‌లో 25 శాతం, నవంబర్‌లో 20 శాతం మేర లోటు వర్షపాతం నమోదు కానుందన్నారు. డిసెంబర్ నెలలో మాత్రం 1 శాతం అదనపు వర్షపాతం నమోదువుతుంది. వివిధ బేసిన్లల్లో జలాలు తగ్గిపోతున్నాయి. ప్రాజెక్టులు, రిజర్వాయర్లల్లో జలాలు అడుగంటుతున్నాయి. శ్రీశైలానికి 753 టీఎంసీల నీరు రావాల్సి ఉంటే.. ఈసారి 214 టీఎంసీల నీరు మాత్రమే వచ్చింది. మన రాష్ట్రానికి నీళ్లు కర్ణాటక, మహారాష్ట్ర నుంచి వస్తాయి. వాళ్ల రిజర్వాయర్లు నిండిన తర్వాతే మనకు నీళ్లు వస్తాయి. దీని వల్ల శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులకు నీరు తక్కువగా వస్తోంది. గోదావరి బేసిన్లో కూడా జలాల లభ్యత తక్కువగా ఉంది' అని అన్నారు.

# విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి**
**విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉంది**
**ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేశాం**
**గత పాలకులు టిమ్స్‌లకు కొబ్బరికాయలు కొట్టి వదిలేశారు**
**వచ్చే ఏడాదికల్లా ఉస్మానియా సహా అన్ని ఆస్పత్రులు ప్రారంభిస్తాం**
**కార్పోరేట్ స్థాయిలో ఆస్పత్రుల నిర్వహణ**
**సనత్ నగర్ టిమ్స్ ప్రారంభోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి**



**హైదరాబాద్,ఆగస్ట్17(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ ప్రజా పాలనలో విద్య, వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న అవకాశాలను అందిపుచ్చుకునేలా విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకురావాల్సిన అవసరం ఉందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పేదల ఆరోగ్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యత అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ ఉచిత వైద్యం అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. గత 32 నెలల్లో ఆరోగ్యశ్రీ కోసం రూ.2,600 కోట్లు ఖర్చు చేసినట్లు సీఎం రేవంత్‌రెడ్డి వెల్లడించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వ ఆస్పత్రుల సామర్థ్యాన్ని మరింత పెంచుతున్నామని తెలిపారు. తెలంగాణ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (టిమ్స్) ఆస్పత్రులు పేదలకు ఎంతో ఉపయోగపడతాయని సీఎం అన్నారు. గత పాలకులు టిమ్స్ నిర్మాణానికి కొబ్బరికాయ కొట్టి పనులను మర్చిపోయారని విమర్శించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్‌లో మూడు టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణాన్ని వేగంగా చేపట్టామని తెలిపారు. అదే విధంగా వరంగల్‌లోనూ ఆస్పత్రి నిర్మాణ పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. 2027 డిసెంబర్ నాటికి రాష్ట్రంలో నిర్మాణంలో ఉన్న ఆస్పత్రులను ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆరు నెలలకు ఒక ఆస్పత్రిని ప్రారంభించే దిశగా ప్రణాళిక రూపొందించామని సీఎం వెల్లడించారు. ఇందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందని తెలిపారు. ఆస్పత్రుల నిర్మాణ పనులు వేగంగా, నాణ్యతతో పూర్తయ్యేలా ప్రత్యేక అధికారులను నియమించి పర్యవేక్షణ చేపడుతున్నామని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. ప్రజా ప్రభుత్వం వ్యవసాయం, మహిళా సంక్షేమంతో పాటు విద్య, వైద్యాన్ని అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని, మన బిడ్డలను ప్రపంచంలోనే గొప్ప స్థానాల్లో చూడాలని నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం అన్నారు. నర్సింగ్ విద్యార్థులకు జర్మనీ, జపాన్ దేశాల్లోనూ అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఈరోజుల్లో ప్రైవేటు వైద్యం అత్యంత ఖరీదుగా మారింది. అందుకే పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చేందుకు టిమ్స్ ను ప్రారంభించుకున్నాం సీఎంఆర్ఎఫ్ కోసం రూ. 2526 కోట్లు ఖర్చు చేశాం. ఇప్పటి వరకు రూ. 5226 కోట్లు పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేశాం. రెండేళ్లలో రూ.21,800 కోట్లు వైద్య ఆరోగ్య శాఖ కోసం ఖర్చు చేశాం. ఉస్మానియా ఆసుపత్రి శిథిలావస్థకు చేరితే,. పదేళ్లు అధికారంలో ఉన్నవాళ్లు కొత్త ఉస్మానియా ఆసుపత్రిని నిర్మించాలని ప్రయత్నించలేదు. టిమ్స్ ఆసుపత్రులు, వరంగల్ ఆసుపత్రికి కేవలం టెంకాయకొట్టి వదిలేశారు. మేం అధికారంలోకి వచ్చాక సనత్ నగర్, ఎల్బీ నగర్, అల్వాల్ టిమ్స్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేసేందుకు చర్యలు తీసుకున్నాం అని సిఎం వివరించారు. ఇవన్నీ పూర్తయితే 10 వేల పడకల ఆసుపత్రులు అందుబాటులోకి వస్తాయి. 2027, డిసెంబర్ 9 వరకు ఉస్మానియా, ఎల్బీ నగర్, అల్వాల్, వరంగల్ ఆసుపత్రులను పూర్తి చేస్తాం. ఒక్కో ఆసుపత్రికి ఒక్కో డైరెక్టర్ ను నియమించి పర్యవేక్షిస్తాం కార్పొరేట్ తరహాలో ఆసుపత్రుల నిర్వహణ ఉండేలా చర్యలు తీసుకుంటాం. ఆసుపత్రికి వచ్చే రోగుల అటెండెంట్ లు ఉండేదుకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు నిధులు మంజూరు చేస్తాం. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అదనంగా సమయాన్ని కేటాయించే సూపర్ స్పెషాలిటీ వైద్యులకు ప్రోత్సహకాలను అందించేలా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నానని అన్నారు. మేం టిమ్స్ ను ప్రారంభిస్తామని చెప్పగానే కొందరు పగటి వేషగాళ్లల్లా వచ్చి తిరిగి పోతున్నారు. కేటీఆర్ వచ్చి ఇది తామే కట్టామని చెప్పి వెళ్లారు. వెనక ఉన్న మెంటల్ హాస్పిటల్ కు వెళ్లి పేషంట్లకు టిమ్స్ లు కట్టింది నేనే నన్ను గుర్తుపట్టలేదా అని కేటీఆర్ అడిగాడట. అక్కడ ఉన్న రోగి ఊకో బిడ్డా నేను కూడా మొదట్లో అలాగే మాట్లాడేవాడిని.. రాను రాను వాడే తగ్గిపోతది అని చెప్పాడట.. మీరు కడితే పదేళ్లలో ప్రారంభించడానికి సమయం దొరకలేదా? మీ కుటుంబమే అధికారంలో వున్నపుడు ఎందుకు రిబ్బన్ కట్ చేయలేదు. మీరు ఎర్రవెల్లి, జన్వాడ, మొయినాబాద్, శంకర్ పల్లి ఫామ్ హౌసులు నిర్మించుకునేందుకు ఒక్క క్షణం కూడా ఆలస్యం కానివ్వలేదు. కానీ పేదలకు వైద్యం అందించే ఆసుపత్రులు పూర్తి చేయాలని ఆలోచన రాలేదా.. ఇకనైనా ఆత్మ పరిశీలన చేసుకోండి..నియోజకవర్గానికో పది, 20 కోట్లు ఖర్చు చేసి సేవ చేస్తే మీ పాపాలు కొంతైనా తగ్గుతాయని అన్నారు. కెసీఆర్, కేటీఆర్ 2034 వరకు మారకూడదని, ఇలాగే ఉండాలని కోరుకుంటున్నా. వాళ్లు అబద్దాలు చెప్పడం మాననంత కాలం నేను ఇలాగే నిజాలు చెబుతూనే ఉంటానని అన్నారు. కార్యక్రమంలో మంత్రులు దామోదర రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు సిగ్గుచేటు





**ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే ప్రజలు తరిమి తరిమి కొడతారు**
**మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్**
**పరకాలకు సీఎం సభతో ఒరిగిందేమీ లేదు**
**మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

**హనుమకొండ,17 ఆగస్టు 2026 ( జై భీమ్ న్యూస్)**

హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

**కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు సిగ్గుచేటు- వినయ్ భాస్కర్**

మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరు సిగ్గుచేటని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులను ప్రారంభిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం గొప్పలు చెప్పుకుంటోందని ఆరోపించారు. తాము చేయని పనులకు రంగులు వేసుకుని అభివృద్ధిగా ప్రచారం చేసుకుంటున్నారని విమర్శించారు. తెలంగాణ ప్రజలందరినీ కేసీఆర్ కుటుంబంగా భావించి అన్ని వర్గాల సంక్షేమం, అన్ని ప్రాంతాల అభివృద్ధికి కృషి చేశారని వినయ్ భాస్కర్ అన్నారు. సామాజిక న్యాయం కోసం కేసీఆర్ అనేక కీలక నిర్ణయాలు తీసుకున్నారని పేర్కొన్నారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో సామాజిక న్యాయం ఎక్కడ కనిపిస్తోందని ప్రశ్నించారు. దళితులు, బీసీలకు కీలక పదవులు కల్పించడం ద్వారా కేసీఆర్ సామాజిక న్యాయాన్ని అమలు చేశారని అన్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వంలో తమకు అనుకూలమైన వారికి పదవులు ఇవ్వడమే సామాజిక న్యాయమా అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి చేసిన చిల్లర వ్యాఖ్యలకు తాము సమాధానం ఇవ్వడం లేదని, తమకు మాటలు రావడం వల్ల కాదని, ప్రజల కోసం సంయమనంతో వ్యవహరిస్తున్నామని అన్నారు. ఓఆర్ఆర్ విషయంలో గతంలో రైతులను అడ్డుపెట్టుకుని వ్యతిరేకించిన వారే ఇప్పుడు ఆ ప్రాజెక్టును తామే తీసుకొచ్చామని చెప్పుకుంటున్నారని విమర్శించారు. అబద్ధాలను నిజాలుగా ప్రచారం చేసే ప్రయత్నాలను ప్రజలు గమనిస్తున్నారని వినయ్ భాస్కర్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే ప్రజలు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

**కక్షసాధింపు ప్రభుత్వంగా కాంగ్రెస్ పాలన - చల్లా ధర్మారెడ్డి**

పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు ధోరణితో పాలన సాగిస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరకాలలో నిర్వహించిన సభతో నియోజకవర్గానికి ఒరిగిందేమిటని ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ముఖ్యమంత్రి సభలో ఎలాంటి స్పష్టమైన ప్రకటన చేయలేదన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధి పనులకు రంగులు వేసి, వాటిని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పనులుగా చెప్పుకోవడం సరికాదన్నారు. ప్రజాధనాన్ని వృథా చేస్తూ ప్రజాపాలన పేరుతో ముఖ్యమంత్రి సభలు నిర్వహిస్తున్నారని విమర్శించారు. సీఎం ప్రసంగం వినలేక ప్రజలు సభా ప్రాంగణం నుంచి వెళ్లిపోయారని చల్లా ధర్మారెడ్డి అన్నారు. రైతులకు అవసరమైన యూరియా నిల్వలను అందుబాటులో ఉంచలేని అసమర్థ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి మిగిలిపోయారని విమర్శించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి పేరును కూడా ముఖ్యమంత్రి సరిగ్గా ప్రస్తావించలేకపోయారని, అలాంటి పరిస్థితుల్లో పరకాల ప్రజల సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. నీటి సమస్యలపై సరైన అవగాహన లేని మంత్రి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. నియోజకవర్గంలో సభా ప్రాంగణానికి సమీపంలో ఉన్న ఇంటిగ్రేటెడ్ కూరగాయలు, మాంసాహార మార్కెట్‌ను పూర్తి చేయడంతో పాటు దామెర చెరువు సుందరీకరణ పనులను పూర్తి చేయడంపై ఎమ్మెల్యే దృష్టి పెట్టడం లేదని ఆరోపించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా చిరు వ్యాపారుల దుకాణాలను తొలగించి వారిని రోడ్డున పడేశారని, వారి కోసం నిర్మిస్తున్న సముదాయాన్ని పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదన్నారు. సభకు రావాలని మహిళా సంఘాలపై ఒత్తిడి తీసుకొచ్చారని, రాకపోతే జరిమానా విధిస్తామని బెదిరించారని ఆరోపించారు. గత మూడేళ్లలో పరకాల నియోజకవర్గంలో ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి చేసిన అభివృద్ధి ఏమిటో ప్రజలకు వివరించాలని చల్లా ధర్మారెడ్డి డిమాండ్ చేశారు. అధికార బలంతో ఏం మాట్లాడినా చెల్లుతుందని భావించడం సరికాదని, ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని అన్నారు.

# వేములవాడ ఆలయంలో విజిలెన్స్ తనిఖీలు

**వేములవాడ,ఆగస్ట్17(జై భీమ్ న్యూస్):**

వేములవాడ రాజన్న ఆలయంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇద్దరు సీఐలతోపాటు , ఒక తహసీల్దార్, అధికారులతో కూడిన పదిమంది బృందం మూడు బృందాలుగా ఏర్పడి ఆరు గంటలుగా సోదాలు చేస్తున్నారు. ప్రధానంగా ఆరోపణలు వచ్చిన విచారణ కార్యాలయం, గదుల నిర్వహణ, లీజులు, అన్నదానం, గోదాం, లడ్డు ప్రసాదం, పీఆర్వో కార్యాలయం తదితర విభాగాల్లో రికార్డులను పరిశీలిస్తున్నారు. లోతైన విచారణ జరిపేందుకు పలు రికార్డులను స్వాధీనం కూడా చేసుకున్నట్లు తెలిసింది. ఒక్కసారిగా విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించడంతో ఆలయ అధికారులు ఉలిక్కిపడ్డారు. అయితే రాత్రి వరకు తనిఖీలు నిర్వహించే అవకాశం ఉండగా ఏదైనా విభాగం మిగిలితే మరుసటి రోజు కూడా నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం.

# కళ్యాణ, షాదీముబారక్ కొనసాగుతుంది

**గత ప్రభుత్వం పక్కాగా అమలు చేయలేదు**
**అందుకే కోర్టుల్లో కేసులు వచ్చాయి**
**దీనిపై డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేస్తున్నాం**
**ధర్నాలు చేసే వారు పథకలంఓ తప్పిదాలపై మాట్లాడాలి**
**మీడియా సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి**



**హైదరాబాద్,ఆగస్ట్17(జై భీమ్ న్యూస్):**

కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కళ్యాణ లక్ష్మి షాది, ముబారక్ గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంత్రి వాకిటి శ్రీహరితో కలిసి మీడియా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కళ్యాణ లక్ష్మి పథకంపై వివరించారు. కళ్యాణ్ లక్ష్మీ పథకం పై ఇప్పటివరకు జారీ చేసిన 8 జీవోలను ఒక పిటిషన్ హైకోర్టులో వేసిందన్నారు. అందులో భాగంగా ఈ పథకాన్ని ఆపాలని హైకోర్టు మధ్యంతర ఆదేశాలకు ఇవ్వడం జరిగింది. దీనిపై డివిజనల్ బెంచ్ కు అప్పీల్ కై వెళుతున్నాము. సానుకూల నిర్ణయం వస్తుందని ఆశిస్తున్నాం అని మంత్రి తెలిపారు. ఈ పథంలోని లొసుగులు ఏదైనా ఉంటే అది గత ప్రభుత్వం 2014లో చేసిన పొరపాటు వల్ల తలెత్తినది. అప్పుడు సరైన రీతులో ఉత్తర్వులు ఇచ్చి ఉంటే ఈ పరిస్థితి ఉండేది కాదన్నారు. తమ ప్రభుత్వం త్వరలో గత ప్రభుత్వం చేసిన అన్ని తప్పిదాలను సరిచేసి ఈ పథకం కొనసాగేలా చేస్తామన్నారు. గత ప్రభుత్వం పథకం లోప భూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే ఈ పథకం ఇలా అయిందన్నారు. కౌంటర్ ఫైల్ చేయడానికి అధికారుల లోపమా లేదా ప్రభుత్వంలో న్యాయపరమైన అంశాలు చూసే వారి లోపమా అని విచారణ చేస్తున్నాం.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. తెలంగాణ ప్రజలకు కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకాల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పొన్నం స్పష్టం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లు పేద కుటుంబాలకు అండగా నిలిచిన సంక్షేమ పథకాలని అన్నారు. పేదింటి ఆడబిడ్డ వివాహ సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడమే ఈ పథకాల ప్రధాన ఉద్దేశం అని తెలిపారు. ఈ పథకాలను గత ప్రభుత్వం ప్రారంభించింది. రాజకీయాలకు అతీతంగా పేదల ప్రయోజనం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తోంది. పేదలకు నష్టం కలగకుండా న్యాయపరంగా అందుబాటులో ఉన్న అన్ని అవకాశాలను ప్రభుత్వం వినియోగిస్తుంది. రాజకీయ పిటిషన్లు పై ఈ పథకం ఎందుకు కొనసాగిస్తున్నారు అని స్టే ఇచ్చింది.. పథకాన్ని ఎత్తివేయలేదు..ఇది గత ప్రభుత్వ పథకం దీనిని ఎత్తివేయాలని మేము ఆలోచన చేయలేదు. గతంలో నిధులు కేటాయింపులకు సంబంధించిన ఇబ్బంది ఉన్న మేము వచ్చిన తర్వాత గ్రీన్ చానెల్ ద్వారా నిధులు విడుదల చేసాం. వాళ్లు చేసిన అప్పులు.. దానిని తొలగించడానికి నిధుల సకాలంలో విడుదల చేయడానికి వ్యవస్థ ఏర్పాటు చేయలేదు.. పేద ల పిల్లల వివాహాలకు సామాజికంగా ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న వారికి ప్రభుత్వం బాసటగా ఉండాలని ప్రభుత్వం భావిస్తుంది. 12 తారీకు స్టే విధించింది.. వచ్చే నెల 9 వరకు అవకాశం ఉన్నప్పటికీ అప్పటి వరకు వెయిట్ చేయకుండా కోర్టులో స్టే తొలగించడానికి ముందుకు పోయాం.. రోడ్ల మీద నిరసనలు చేస్తున్న నాయకులకు చెప్తున్న మీరు చేసిన జీవోల వల్లే పథకానికి ఈ పరిస్థితి వచ్చింది. అయినా మేము కొనసాగిస్తున్నాం అన్నారు. బహుజన నాయకుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376 జయంతి సందర్భంగా ట్యాంక్ బండ్ పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహావిష్కరణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభిస్తారని అన్నారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి, పీసీసీ,మంత్రులు ,ఎమ్మెల్యేలు ,ఎమ్మెల్సీలు , ఎంపీలు, ప్రజా ప్రతినిధులు ,బలహీన వర్గాల నాయకులు ,కుల సంఘాల నాయకులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. మొన్ననే ట్యాంక్ బండ్ పక్కన సామాజిక ఉద్యమ నాయకుడు మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రి బాయ్ పూలే విగ్రహావిష్కరణ చేసుకున్నామని మంత్రి వివరించారు.

# ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యం

**ఏకీకృ'త వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తీసుకొచ్చాం**
**ఎక్స్ వేదికగా సిఎం రేవంత్ స్పష్టీకరణ**

**హైదరాబాద్,ఆగస్ట్17(జై భీమ్ న్యూస్):**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా ప్రజా ప్రభుత్వ ప్రాధాన్యతలను, ప్రజారోగ్య పరిరక్షణ దిశగా తీసుకున్న నూతన నిర్ణయాన్ని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రజల భద్రత, రక్షణ, సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. సమాజంలోని ప్రతి అంశంలోనూ చట్టం ప్రకారమే పాలన సాగిస్తూ, ప్రజలకు సంపూర్ణ జవాబుదారీతనంతో సేవలు అందించడమే తమ ప్రభుత్వ ప్రధాన సంకల్పమని పేర్కొన్నారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో ఆహార పదార్థాలు, నిత్యవసర ఔషధాల నాణ్యతను, భద్రతను పర్యవేక్షించేందుకు ఏకీకృత వ్యవస్థగా 'తెలంగాణ సేఫ్' తెలంగాణ స్టాండర్డ్స్ అథారిటీ ఫర్ ఫుడ్ అండ్ ఎసెన్షియల్ డ్రగ్స్ ను అమలులోకి తీసుకువచ్చినట్లు వెల్లడించారు. ఇప్పటివరకు వేర్వేరుగా ఉన్న ఆహార భద్రత, ఔషధ నియంత్రణ విభాగాలను ఒకే గొడుగు కిందకు తీసుకువచ్చి, ప్రజారోగ్య పరిరక్షణకు ఈ నూతన అథారిటీ ద్వారా కఠిన ప్రమాణాలు అమలు చేయనున్నట్లు తెలియజేశారు. దీని ద్వారా మార్కెట్లో లభించే ఆహార పదార్థాల్లో కల్తీని నిరోధించడం, నకిలీ , ప్రమాదకర మందుల విక్రయాలకు అడ్డుకట్ట వేయడం సాధ్యమవుతుంది. క్షేత్రస్థాయిలో తనిఖీలు పెరిగి, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై తక్షణ చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి వీలవుతుంది. ఫలితంగా పౌరులకు సురక్షితమైన ఆహారం, సమర్థవంతమైన మందులు అందుబాటులోకి వచ్చి, ప్రజారోగ్యానికి సంపూర్ణ భద్రత చేకూరుతుంది. నాణ్యమైన ఆహారం, సురక్షితమైన మందులు అందించడమే లక్ష్యంగా పనిచేసే '÷ఉ-÷ూజౌ।' సేవలను ఉపయోగించుకుంటూ, ఆరోగ్యవంతమైన, సురక్షితమైన తెలంగాణ నిర్మాణంలో రాష్ట్ర పౌరులందరూ భాగస్వాములు కావాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు.

జై భీమ్ తెలుగు దినపత్రిక
POWER OF PEOPLE
సమస్యలపై సమరంగా
Jai Bheem TV STRUGGLE FOR JUSTICE
సామాన్యుడి ఆయుధంగా

# విద్యార్థులు నిత్యం నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలి

**మార్కులతో పాటు నూతన విషయ పరిజ్ఞానం, కమ్యూనికేషన్ నైపుణ్యాలు అవసరం**

**తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు**



**కేయూ క్యాంపస్, 17 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

విద్యార్థులు నిత్యం నూతన విషయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవడంతో పాటు తమ నైపుణ్యాలను నిరంతరం మెరుగుపరచుకోవాలని తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు సూచించారు. కాకతీయ విశ్వవిద్యాలయంలోని ప్రభుత్వ పాలన, మానవ వనరుల విభాగాన్ని తెలంగాణ విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ తోపుచర్ల యాదగిరిరావు సందర్శించారు. ఈ సందర్భంగా విభాగం విద్యార్థులతో ఆయన ముఖాముఖి మాట్లాడి పలు సూచనలు, సలహాలు అందించారు. విభాగాధిపతి ప్రొఫెసర్ పెదమళ్ళ శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో ప్రొఫెసర్ యాదగిరిరావు మాట్లాడుతూ విద్యార్థులు తమ దృష్టిని కేవలం మార్కులపైనే కేంద్రీకరించకుండా నూతన విషయాలను తెలుసుకోవడంపై కూడా ఆసక్తి చూపాలని సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులకు కేవలం విద్యార్హతలు మాత్రమే సరిపోవని, అదనంగా వివిధ నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రత్యేకంగా కమ్యూనికేషన్ నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు, విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని సూచించారు. విద్యార్థులు నిరంతరం నేర్చుకునే అలవాటును పెంచుకుంటే భవిష్యత్తులో మెరుగైన ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. విద్యార్థులు తమ ఆసక్తి ఉన్న రంగాల్లో నూతన విషయాలను అన్వేషిస్తూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా తమను తాము తీర్చిదిద్దుకోవాలని ఆయన సూచించారు. విద్యార్థి దశలోనే వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలు, సంభాషణ నైపుణ్యాలను పెంపొందించుకుంటే వృత్తి జీవితంలో ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు డాక్టర్ ఆకుతోట శ్రీనివాసులు, డాక్టర్ చీకటి శ్రీను, డాక్టర్ బుర్రి ఉమాశంకర్, డాక్టర్ దేవేంద్రచారి, విద్యార్థులు పాల్గొన్నారు.

# కూల్చివేతలపై అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

**బాధితులందరికీ న్యాయం చేయాలి**

**సీపీఐ నాయకులు**




**రామగుండం, 17 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

రామగుండం పారిశ్రామిక ప్రాంతంలో జరుగుతున్న కూల్చివేతలపై అఖిలపక్ష కమిటీ ఏర్పాటు చేసి సమగ్ర విచారణ జరపాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గోదావరిఖని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన సమావేశంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు గౌతమ్ గోవర్ధన్, గోశిక మోహన్, ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య, శనిగరపు చంద్రశేఖర్ మాట్లాడారు. ఎల్బీనగర్ కాంప్లెక్స్‌ను విచారణ లేకుండానే కూల్చివేశారని, అనంతరం బాధితులకు రూములు ఇస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రూముల కేటాయింపులో పారదర్శకత పాటించి అర్హులైన యజమానులు, అద్దెదారులందరికీ న్యాయం చేయాలని కోరారు. ఎల్బీనగర్, తిలక్‌నగర్, రాజేష్ థియేటర్, బస్టాండ్ కాలనీ తదితర ప్రాంతాల్లో అఖిలపక్షంతో నిజనిర్ధారణ చేపట్టాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్‌ను డిమాండ్ చేశారు. లబ్ధిదారుల వివరాలను బహిరంగంగా ప్రకటించాలని, ఏ ఒక్కరికి అన్యాయం జరిగినా పోరాటం కొనసాగిస్తామని హెచ్చరించారు. సమావేశంలో సీపీఐ నాయకులు ఆశాల నవీన్, అబ్దుల్ కరీం, గంగారపు చంద్రయ్య, బూడిది మల్లేష్, సాదుల శివ, ఈశ్వర్, అనూప్ సాయి, బాధితులు దశరథం, రమేష్, శ్రీనివాస్, రంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# అంకితభావం, క్రమశిక్షణ, దృఢసంకల్పంతో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

**కాకతీయ యూనివర్సిటీ ఓఎస్డీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి**

**కేయూ క్యాంపస్, 17 ఆగస్టు 2026 (జై భీమ్ న్యూస్)**

అంకితభావం, క్రమశిక్షణ, దృఢసంకల్పంతో విద్యార్థులు తమ లక్ష్యాలను సాధించి ఉన్నత స్థానాలకు చేరుకోవాలని కాకతీయ యూనివర్సిటీ ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ ఆచార్య బి. వెంకట్రామరెడ్డి అన్నారు. కాకతీయ యూనివర్సిటీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో బీటెక్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు నిర్వహించిన పరిచయ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సమయాన్ని, అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు బోధించే అంశాలతో పాటు ఇతర వనరుల ద్వారా జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, నైపుణ్యాలను సాధించడంతో పాటు అధ్యాపకులను గౌరవించాలని అన్నారు. వరంగల్ ఎన్‌ఐటీ ఆచార్య ఆనంద్ కిశోర్ కోలా కీలక ప్రసంగం చేస్తూ సాంకేతిక నైపుణ్యాలతో పాటు సామాజిక బాధ్యత, మానవీయ విలువలను విద్యార్థులు పెంపొందించుకోవాలని సూచించారు. బహుళశాఖా విధానంతో విద్యను అభ్యసించడం ద్వారా భవిష్యత్ ఇంజినీర్లు నైపుణ్యవంతులైన, బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగగలరన్నారు. సాంకేతిక నైపుణ్యం, నైతిక విలువలు, మానవీయ దృక్పథం సమన్వయమే సమగ్ర విద్యకు పునాది అని పేర్కొన్నారు. కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎన్. రమణ అధ్యక్షత వహించారు.

# మేయర్ పీఠంపై అధికార పార్టీలోనే హోరాహోరీ పోటీ?

**మేయర్ పదవిపై పలువురు ఆశావహుల కన్ను..**

**అధిష్ఠానం ఆశీస్సుల కోసం నేతల ప్రయత్నాలు**

**తాజా మాజీ మేయర్ గుండు సుధారాణితో పాటు పలువురి పేర్లు తెరపైకి**

**తెరవెనుక మరో ఆశావహుడి కోసం చర్చ**

**వరంగల్, 17 ఆగస్ట్ 2026 (జై భీమ్ న్యూస్)**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల నేపథ్యంలో నగర రాజకీయాలు క్రమంగా వేడెక్కుతున్నాయి. ఎన్నికల తేదీ, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉన్నప్పటికీ, ఇప్పటికే ప్రధాన రాజకీయ పార్టీల్లో అంతర్గతంగా కసరత్తు ప్రారంభమైనట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా అధికార కాంగ్రెస్ పార్టీలో మేయర్ పీఠాన్ని దక్కించుకోవాలనే ఆశతో పలువురు నాయకులు తమ స్థాయిలో ప్రయత్నాలు ప్రారంభించినట్లు ప్రచారం సాగుతోంది. మేయర్ పదవి వరంగల్ నగర రాజకీయాల్లో అత్యంత కీలకమైనదిగా భావిస్తుండటంతో ఈ పదవిపై పలువురు నేతలు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. పార్టీ అధిష్ఠానం వద్ద తమకు ఉన్న పరిచయాలు, రాజకీయ ప్రాధాన్యత, సామాజిక సమీకరణాలు, నగరంలో తమకు ఉన్న అనుచరగణం వంటి అంశాలను ముందుకు తెస్తూ పలువురు ఆశావహులు తమ ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారనే చర్చ వినిపిస్తోంది.

### మేయర్ పీఠంపై ఐదుగురి కన్ను?

ప్రస్తుతం రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్న పేర్లలో జంగా రాఘవరెడ్డి పేరు ప్రముఖంగా ఉంది. గతంలో ఎమ్మెల్యే టికెట్ కోసం ప్రయత్నించిన ఆయనకు గ్రేటర్ వరంగల్ రాజకీయాల్లో పరిచయాలు ఉన్నాయని ఆయన అనుచర వర్గాలు చెబుతున్నాయి. మేయర్ పదవిపై ఆయన కూడా ఆసక్తి చూపుతున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇదే సమయంలో మాజీ నగర మేయర్ గుండు సుధారాణి పేరు కూడా మరోసారి తెరపైకి వచ్చింది. గతంలో మేయర్‌గా పనిచేసిన అనుభవం, పార్టీ నాయకత్వంతో ఉన్న సంబంధాలను బలంగా చూపిస్తూ ఆమె కూడా మరోసారి మేయర్ పదవిని ఆశిస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతోంది. అయితే ఈ విషయంపై తుది నిర్ణయం పార్టీ అధిష్ఠానం తీసుకోవాల్సి ఉంటుంది. జిల్లా మంత్రి కొండా సురేఖ కుటుంబం నుంచి కూడా మేయర్ పదవిపై ఆసక్తి ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. మంత్రి కుమార్తె కొండా సుస్మిత పటేల్ పేరు ఈ విషయంలో వినిపిస్తోంది. నగర రాజకీయాల్లో మంత్రి కుటుంబానికి ఉన్న ప్రభావం, పార్టీ అధిష్ఠానంతో ఉన్న సంబంధాలు తమకు అనుకూలంగా మారుతాయనే అంచనాతో ఈ వర్గం ప్రయత్నాలు చేస్తున్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. మరోవైపు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కుటుంబం నుంచి కూడా మేయర్ పదవిపై ఆసక్తి ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ఎమ్మెల్యే అల్లుడు విష్ణువర్ధన్ రెడ్డి పేరు ఆశావహుల జాబితాలో వినిపిస్తోంది. పశ్చిమ నియోజకవర్గంలో ఎమ్మెల్యేకు ఉన్న రాజకీయ బలం, నగర రాజకీయాల్లో తమ వర్గాన్ని మరింత బలోపేతం చేసుకోవాలనే వ్యూహంతో ఈ ప్రయత్నాలు జరుగుతున్నాయనే చర్చ ఉంది. అలాగే వర్ధన్నపేట ఎమ్మెల్యే కే. నాగరాజు తనయుడు కూడా మేయర్ పదవిపై ఆసక్తి చూపుతున్నట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. దీంతో అధికార కాంగ్రెస్‌లోనే మేయర్ పీఠంపై పలువురు ఆశావహులు ఉన్నారనే చర్చ మరింత జోరందుకుంది.

### తెరపై ఐదుగురు.. తెరవెనుక ఆరో వ్యక్తి?

ప్రస్తుతం బహిరంగంగా వినిపిస్తున్న పేర్లు ఐదుగురివరకు ఉన్నప్పటికీ, తెరవెనుక మరో కీలక ఆశావహుడు కూడా మేయర్ పదవి కోసం ప్రయత్నాలు చేస్తున్నారనే గుసగుసలు రాజకీయ వర్గాల్లో వినిపిస్తున్నాయి. అయితే ఆ వ్యక్తి ఎవరనే విషయంలో మాత్రం స్పష్టత లేదు. పార్టీ అధిష్ఠానంతో ఉన్న సంబంధాలు, స్థానిక రాజకీయ సమీకరణాలు, సామాజిక వర్గాల మద్దతు, నగరంలో వ్యక్తిగత పరిచయాలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని పలువురు నేతలు తమ బలాన్ని చాటుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఇప్పటివరకు వినిపిస్తున్న పేర్లే తుది జాబితా అవుతాయా? లేక రానున్న రోజుల్లో మరికొందరి పేర్లు కూడా తెరపైకి వస్తాయా? అనేది ఆసక్తికరంగా మారింది.

### కార్పొరేటర్ టికెట్లపైనే అసలు పోటీ?

మేయర్ పదవిని ఆశిస్తున్న నేతలకు ముందుగా ఎన్నికల రాజకీయాల్లో తమ స్థానాన్ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉండటంతో అసలు పోటీ కార్పొరేటర్ టికెట్ల నుంచే మరింత స్పష్టమయ్యే అవకాశం ఉంది. ఒకవైపు మేయర్ పదవిపై ఆశలు పెట్టుకున్న నాయకులు తమకు అనుకూలమైన డివిజన్లలో రాజకీయంగా కసరత్తు చేస్తుండగా, మరోవైపు ఆయా డివిజన్లలో ఎన్నో సంవత్సరాలుగా పార్టీ కోసం పనిచేస్తున్న స్థానిక నాయకులు, కార్యకర్తలు కూడా టికెట్ కోసం పోటీ పడుతున్నారు. ఒకే డివిజన్‌లో పలువురు ఆశావహులు ఉంటే ఎవరికి అవకాశం ఇవ్వాలి? ఎవరిని బుజ్జగించాలి? టికెట్ దక్కని వారిని పార్టీతో ఎలా కొనసాగించాలి? అనే అంశాలు కాంగ్రెస్ నాయకత్వానికి సవాలుగా మారే అవకాశం ఉంది.

### సామాజిక సమీకరణాలే కీలకమా?

గ్రేటర్ వరంగల్ ఎన్నికల్లో స్థానిక సమస్యలతో పాటు సామాజిక, రాజకీయ సమీకరణాలు కూడా ప్రభావం చూపే అవకాశం ఉంది. అందువల్ల మేయర్ పదవికి ఎవరిని ఎంపిక చేయాలన్న విషయంలో పార్టీ నాయకత్వం అనేక అంశాలను పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉంది. అభ్యర్థి గెలుపు సామర్థ్యం, ప్రజల్లో ఉన్న పరిచయం, పార్టీకి చేసిన సేవలు, స్థానికంగా ఉన్న బలం, సామాజిక సమీకరణాలు తదితర అంశాలు కీలకంగా మారవచ్చని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

### అధిష్ఠానం నిర్ణయమే కీలకం

మేయర్ పీఠంపై పలువురు ఆశలు పెట్టుకున్నప్పటికీ చివరకు పార్టీ అధిష్ఠానం నిర్ణయమే కీలకం కానుంది. స్థానికంగా ఎవరెంత ప్రయత్నాలు చేసినా పార్టీ నాయకత్వం తీసుకునే తుది నిర్ణయాన్ని అందరూ పాటించాల్సి ఉంటుంది. ఒకరికి అనుకూలంగా నిర్ణయం వెలువడితే మిగిలిన ఆశావహులను ఎలా సమన్వయం చేస్తారు? టికెట్ ఆశించి భంగపడిన నేతలు ప్రత్యామ్నాయ రాజకీయ నిర్ణయాలు తీసుకోకుండా పార్టీ నాయకత్వం ఎలా వ్యవహరిస్తుంది? అన్నది కూడా ఆసక్తికరంగా మారనుంది.

### ప్రతిపక్షాలకు ఇదే అవకాశం?

అధికార పార్టీలో మేయర్ పదవిపై పోటీ, కార్పొరేటర్ టికెట్ల కోసం ఆశావహుల సంఖ్య పెరగడం వంటి పరిణామాలు ప్రతిపక్ష పార్టీలకు రాజకీయంగా ఉపయోగపడే అవకాశం ఉంది. అధికార పార్టీలో టికెట్లు దక్కని ఆశావహులను తమవైపు తిప్పుకోవడం, అసంతృప్తులను తమకు అనుకూలంగా మలుచుకోవడం వంటి వ్యూహాలను ప్రతిపక్షాలు అనుసరించే అవకాశం లేకపోలేదు. అయితే ఎన్నికల సమయంలోనే అసలు రాజకీయ సమీకరణాలు ఎలా మారతాయన్నది స్పష్టమవుతుంది. ఇప్పటి ప్రచారాలు, అంచనాలు ఎన్నికల నోటిఫికేషన్ అనంతరం పూర్తిగా మారిపోయే అవకాశం కూడా ఉంది.

### ప్రజల తీర్పే తుది నిర్ణయం

ఎవరెన్ని రాజకీయ సమీకరణాలు చేసుకున్నా చివరకు ప్రజల తీర్పే కీలకం. మేయర్ పదవిని ఆశిస్తున్న నాయకులు ముందుగా ప్రజల విశ్వాసాన్ని పొందాల్సి ఉంటుంది. నగరంలో రోడ్లు, డ్రైనేజీ, పారిశుధ్యం, తాగునీరు, ట్రాఫిక్, వీధి దీపాలు, మౌలిక వసతులు వంటి సమస్యలపై ప్రజలు ఎవరిని విశ్వసిస్తారన్నది ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయనుంది. ప్రస్తుతం గ్రేటర్ వరంగల్ మేయర్ పీఠంపై అధికార కాంగ్రెస్‌లోనే పలువురు నేతల పేర్లు వినిపించడం నగర రాజకీయాల్లో ఆసక్తిని పెంచుతోంది. తెరపై ఐదుగురు పేర్లు వినిపిస్తుండగా, తెరవెనుక ఆరో వ్యక్తి కూడా ప్రయత్నిస్తున్నారన్న ప్రచారం మరింత ఉత్కంఠను పెంచుతోంది.

### ఎవరి వైపు అధిష్ఠానం మొగ్గు?

జంగా రాఘవరెడ్డి, గుండు సుధారాణి, కొండా సుస్మిత పటేల్, విష్ణువర్ధన్ రెడ్డి, కే. నాగరాజు తనయుడు.. ఇలా పలువురు పేర్లు రాజకీయ వర్గాల్లో చర్చకు వస్తున్న నేపథ్యంలో చివరకు అధిష్ఠానం ఎవరిని ప్రోత్సహిస్తుంది? ఎవరికి అవకాశం దక్కుతుంది? ఎవరికి కార్పొరేటర్ టికెట్ లభిస్తుంది? ప్రజలు ఎవరిని ఎన్నుకుంటారు? అన్నదే ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది. ఏదేమైనా, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలు దగ్గరపడే కొద్దీ రాజకీయ వేడి మరింత పెరిగే అవకాశముంది. అభ్యర్థుల ఎంపిక, టికెట్ల కేటాయింపు, అంతర్గత సమీకరణాలు, రెబల్ అభ్యర్థుల ప్రభావం, ప్రతిపక్షాల వ్యూహాలు, చివరకు ప్రజల తీర్పు. ఇవన్నీ కలిసి గ్రేటర్ వరంగల్ మేయర్ పీఠం ఎవరిని వరిస్తుందో నిర్ణయించనున్నాయి.




# డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పోలీసింగ్‌లో మార్పులకు శ్రీకారం

**తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ**

**హైద్రాబాద్, 17 ఆగస్టు 2026(జై భీమ్ న్యూస్)**

తెలంగాణ రాష్ట్ర డీజీపీగా సీవీ ఆనంద్ ఐపీఎస్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి పోలీస్ శాఖలో చేపడుతున్న మార్పులు, సంస్కరణలు, ఆధునిక పోలీసింగ్ విధానాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై ప్రత్యేక కథనం కోసం జై భీమ్ టీవీ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ బరిగెల శివ తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుమారు 20 నిమిషాల పాటు డీజీపీతో పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పోలీసింగ్‌ను ప్రజలకు మరింత చేరువ చేయడం, నేరాలను ముందస్తుగా గుర్తించి నియంత్రించడం, పోలీస్ అధికారుల పనితీరును మెరుగుపరచడం వంటి అంశాలపై చర్చ సాగింది. మారుతున్న నేరాల స్వరూపానికి అనుగుణంగా పోలీస్ శాఖను ఆధునీకరించడంపై డీజీపీ ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఈ సందర్భంగా వెల్లడైంది. ముఖ్యంగా సైబర్ క్రైమ్, డ్రగ్స్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి పెట్టడంతో పాటు యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు, నిఘా వ్యవస్థలు, సమన్వయ చర్యలను మరింత బలోపేతం చేయాల్సిన అవసరంపై చర్చించారు. అలాగే రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ట్రాఫిక్ నిబంధనలపై ప్రజల్లో అవగాహన పెంచడం, రోడ్డు భద్రతకు ప్రాధాన్యం ఇవ్వడం వంటి అంశాలు కూడా చర్చకు వచ్చాయి. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసింగ్‌లో విస్తృతంగా వినియోగించడం ద్వారా నేర నియంత్రణను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ), డ్రోన్లు, ఆధునిక నిఘా వ్యవస్థలు, డిజిటల్ టెక్నాలజీ వంటి వాటిని అవసరమైన సందర్భాల్లో వినియోగించడంపై పోలీస్ శాఖ దృష్టి సారిస్తున్నట్లు చర్చించారు. పోలీస్ అధికారుల పనితీరు, క్షేత్రస్థాయి పర్యవేక్షణను మరింత బలోపేతం చేయడం ద్వారా ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని కూడా ప్రస్తావించారు. పోలీస్ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను స్వయంగా పరిశీలిస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని పనిచేసే విధానాన్ని మరింత బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా జోనల్ స్థాయిలో డీఐజీల పర్యవేక్షణ వ్యవస్థను తిరిగి బలోపేతం చేయడం వంటి పరిపాలనా మార్పులు కూడా పోలీస్ శాఖ పనితీరును మెరుగుపరిచే దిశగా చేపట్టిన చర్యల్లో భాగంగా చర్చించారు. డీజీపీగా సీవీ ఆనంద్ చేపడుతున్న మార్పులు, సంస్కరణలతో పాటు భవిష్యత్‌లో తెలంగాణ పోలీసింగ్ ఏ విధంగా ముందుకు సాగాలి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ప్రజల భద్రతను మరింత పటిష్టం చేయాలి అనే అంశాలపై డాక్టర్ బరిగెల శివ ప్రత్యేకంగా చర్చించారు. ప్రజలకు పోలీసులపై మరింత విశ్వాసం కలిగేలా ఫ్రెండ్లీ పోలీసింగ్, వేగవంతమైన స్పందన, జవాబుదారీతనం, క్షేత్రస్థాయి పర్యవేక్షణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఇరువురు అభిప్రాయపడ్డారు. ప్రజా భద్రతతో పాటు సమాజంలో బాధ్యతాయుతమైన పౌరస్పృహను పెంపొందించడం, పర్యావరణ పరిరక్షణకు ప్రజలను భాగస్వాములను చేయడం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యం ఇవ్వాలని ఈ సందర్భంగా చర్చించారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు ప్రతీకగా డాక్టర్ బరిగెల శివ ప్లాంటేషన్ మొక్కను డీజీపీ సీవీ ఆనంద్‌కు అందజేశారు. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా ప్రతి ఒక్కరి బాధ్యత అనే సందేశాన్ని ఈ సందర్భంగా చాటిచెప్పారు. మొత్తంగా డీజీపీ సీవీ ఆనంద్‌తో జరిగిన ఈ మర్యాదపూర్వక భేటీలో తెలంగాణ పోలీస్ శాఖలో జరుగుతున్న మార్పులు, పరిపాలనా సంస్కరణలు, సైబర్ నేరాలు, డ్రగ్స్ నియంత్రణ, రోడ్డు భద్రత, ఏఐ–డ్రోన్ల వినియోగం, ఆధునిక పోలీసింగ్ విధానాలు, అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ, ప్రజలకు మరింత చేరువైన పోలీసింగ్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. మారుతున్న కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకుని మరింత ఆధునికమైన, సమర్థవంతమైన, ప్రజా కేంద్రిత పోలీసింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలనే దిశగా సాగుతున్న ప్రయత్నాలపై ఈ భేటీ ప్రత్యేక దృష్టిని సారించింది.



# నమ్మకం లేకపోతే ఏ బంధం నిలవదు..!




వివాహ జీవితం సుఖంగా సాగాలంటే ప్రేమ, గౌరవం, నమ్మకం, క్షమ, సానుభూతి వంటి విలువలతో నిండిన అనుబంధం కావాలి. ఇందుకు సద్గురు ఇచ్చిన మార్గదర్శకాలు ఎంతో ఉపయోగపడతాయి. ఈ విలువలు జీవిత భాగస్వాముల మధ్య బంధాన్ని బలపరచడమే కాకుండా.. జీవితాన్ని సంతోషంగా జీవించడానికి ఉపయోగపడతాయి. వివాహం అనేది కేవలం ఒక సంప్రదాయ సంబంధం కాదు. సద్గురు ఏం చెబుతున్నారో తెలుసా..? వివాహం అనేది మన జీవితంలో మనకు తోడుగా ఉండే వ్యక్తిని ఎంచుకోవడమే. శారీరక, భావోద్వేగ, మానసిక, ఆర్థిక, సామాజిక అవసరాలను పూరించగల వ్యక్తి జీవిత భాగస్వామిగా ఉండాలి. ఈ బంధం నిశ్చలంగా నిలవాలంటే దానికి శ్రద్ధ అవసరం. ఏ బంధమైనా రోజురోజుకూ మారుతూ ఉంటుంది. మనం నిర్లక్ష్యం చేస్తే దూరమవుతుంది. కాబట్టి మన జీవిత భాగస్వామితో అనుబంధాన్ని ప్రేమగా, శ్రద్ధగా చూసుకోవాలి. ఒక మంచి వివాహ బంధానికి ముఖ్యమైన అంశం సంభాషణ. మనసులో ఉన్న విషయాలను బహిరంగంగా చెప్పుకోవడం ద్వారా భావోద్వేగాలు సమతుల్యతలో ఉంటాయి. ఇది ఇద్దరినీ దగ్గర చేస్తుంది. అలాగే ఒకరినొకరు గౌరవించడం కూడా ఎంతో అవసరం. వివాహం వల్ల మన వ్యక్తిత్వాన్ని కోల్పోవాల్సిన పని లేదు. ప్రతి వ్యక్తికీ తన సొంత అభిప్రాయాలు ఉంటాయి. అవి భిన్నంగా ఉన్నా.. గౌరవించాలి. ఆ గౌరవం బంధాన్ని నిలబెట్టే శక్తిగా ఉంటుంది. ఇక నమ్మకం గురించి చెప్పాలంటే.. అది లేకుండా ఎలాంటి సంబంధం నిలవదు. భర్తా భార్యల మధ్య పరస్పర నమ్మకం పెరిగేలా మాట్లాడుకోవాలి. ఒకరి నమ్మకాన్ని మరొకరు దెబ్బతీయకుండా జాగ్రత్త పడాలి. నమ్మకమే బంధాన్ని బలంగా ఉంచుతుంది. వివాహం అనగా ఒకరి ప్రపంచంలో మరొకరిని కలిపేసుకోవడం కాదు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగతంగా ఎదిగే అవకాశం ఉండాలి. కొన్ని విషయాల్లో స్వేచ్ఛ ఇవ్వడం ద్వారా బంధం మరింత ఆరోగ్యంగా మారుతుంది. మానవ సంబంధాల్లో మనుషుల మధ్య అంచనాలు, అబద్ధాలు, అపార్థాలు సాధారణం. అప్పుడు క్షమించగలగడం ఎంతో అవసరం. చిన్నచిన్న సమస్యల్ని పట్టుకొని బంధాన్ని బలహీనంగా మార్చుకోవద్దు. వ్యక్తిగత లక్షణాలను అంగీకరించగలగడం ద్వారా మన హృదయంలో దయ, ప్రేమ పెరుగుతుంది. మన భాగస్వామిలో ఉన్న అసంపూర్ణతలను అంగీకరించగలగడం ద్వారా జీవితం మరింత సులభంగా సాగుతుంది. జీవిత భాగస్వామి చేసిన పనుల్ని బాధ్యతగా కాకుండా ప్రేమతో చూసుకోవాలి. మనకు చేయబడ్డ సహాయానికి కృతజ్ఞత చూపడం ద్వారా బంధం బలపడుతుంది. భార్యా భర్తలు ఒకే ఇంట్లో ఉన్నా.. కొన్ని ప్రత్యేకమైన సందర్భాలు కలిసి గడపడం అవసరం. కలిసి విహారయాత్రలు, భోజనాలు, లేదా మంచి సమయాన్ని గడపడం ద్వారా ప్రేమ మరింత పెరుగుతుంది. ఈ ప్రయాణంలో నవ్వు ఎంతో కీలకమైనది. ఒకరితో ఒకరు నవ్వుతూ మాట్లాడుకోవడం వల్ల మధ్యలో ఉండే ఒత్తిడులు పోతాయి. ఈ విధంగా సాన్నిహిత్యం పెరుగుతుంది. సద్గురు చెప్పిన ఈ సూచనలు వివాహ బంధాన్ని ప్రేమతో, శాంతితో నింపడానికి చాలా ఉపయోగపడతాయి. ఈ బంధం సాధారణంగా ఉండకూడదంటే, ఇద్దరూ ఒకరినొకరు అర్థం చేసుకునే మనసుతో, పరస్పర గౌరవంతో, క్షమించగల స్వభావంతో జీవించాలి. ఇలాంటి విలువలు ఉన్నప్పుడు మాత్రమే ఈ అనుబంధం బలంగా మారుతుంది.

## అరటి ఆకులో భోజనం దీని వెనుక అసలు కారణం ఇదే

మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. దక్షిణాది రాష్ట్రాల్లో దాదాపు ప్రతి పండగ, వేడుకలో అరటి ఆకుల్లో భోజనం చేయడం కనిపిస్తుంది. పురాతన కాలం నుంచి అరటి ఆకులను వివిధ ఆచారాలు, వేడుకలు, రోజువారీ ఆహారంలో మనోళ్లు ఉపయోగిస్తున్నారు. మన సంస్కృతి ఆరోగ్యకరమైన జీవనశైలికి చిహ్నం. అరటి ఆకులో భోజనం తినడం అమృతంతో సమానమని నమ్ముతారు. ఇందులో ఉండే అనేక పోషకాలు ఆహార రుచిని పెంచుతాయట. దీని ప్రకారం, అరటి ఆకులపై భోజనం చేసేటప్పుడు కొన్ని ఆచారాలు పాటిస్తారు. ఆకులు కడగడం నుంచి చివరికి తినడం, ఆకులు మడతపెట్టడం వరకు కొన్ని ఆచారాలు ఉన్నాయి. తినడానికి ముందు అరటి ఆకుపై నీళ్లు చల్లడం శతాబ్దాల నాటి ఆచారం. దీనికి వివిధ కారణాలు ఉన్నాయి. అరటి ఆకులు సహజంగా కీటకాలు, సూక్ష్మజీవులను కలిగి ఉంటాయి. నీటితో చల్లడం, శుభ్రపరచడం వల్ల ఆకులపై ఉన్న కీటకాలు, సూక్ష్మజీవులు చనిపోతాయి. ఆకులపై దుమ్ము, ధూళిని తొలగించి శుభ్రంగా ఉంచడానికి కూడా ఇలా చేస్తారు. అంతేకాకుండా నీటిని చల్లడం వల్ల ఆకులు గట్టిపడతాయి. ఇలా చేయడం వల్ల తినేటప్పుడు ఆకులు చిరిగిపోవడం వంటి సమస్యలు ఉండవు. అంతేకాకుండా అరటి ఆకుపై నీరు చల్లడం చాలా పవిత్రమైన కార్యమని కూడా నమ్ముతారు. అరటి ఆకులో తిన్న తర్వాత దానిని లోపలికి మడతపెడతారు. అలా చేయడం ఆహారాన్ని తయారు చేసి వడ్డించిన వారికి గౌరవం చూపించే మార్గంగా పరిగణిస్తారు. కొన్నిసార్లు ఆహార అవశేషాలు ఆకు లోపలి భాగంలో ఉంటాయి. అందువల్ల ఆకును బయటి నుండి లోపలికి మడవటం వల్ల అవి జారి పోకుండా ఉంటాయి. అలాగే ఆకును లోపలికి మడతపెట్టడం వల్ల సూర్యరశ్మి దానిలోకి ప్రవేశించకుండా నిరోధిస్తుంది. దీనివల్ల అందులోని ఆహారం చెడిపోకుండా ఉంటుంది.



# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే




శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది. పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి. గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది. గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?



చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుల్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి. చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది. ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము. ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.

## బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్లు తొలగిపోతాయా?



కిడ్నీలో రాళ్లుంటే బీరు తాగితే కరిగిపోతాయని కొన్ని సార్లు వింటుంటాం. ఇది ఎంత వరకు నిజం. బీర్ రాళ్లను కరిగిస్తుందా, రాళ్ళను పగొలగొట్టి వాటిని బయటకు పంపుతుందా? కానీ ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఇది అతిపెద్ద అపోహ. కిడ్నీ మన శరీరంలో చాలా ముఖ్యమైన భాగం. ఇది మన శరీరంలోని టాక్సిన్స్‌ని తొలగించడానికి పని చేస్తుంది. కిడ్నీలో రాళ్ల వల్ల నొప్పి వస్తోందని, చాలా మంది ఆ రాళ్లను తొలగించుకోవడానికి బీరు తాగడం ప్రారంభిస్తారు. ఇప్పుడు బీర్ తాగడం వల్ల కిడ్నీలో రాళ్ల సమస్య తీరుతుందా అనే ప్రశ్న తలెత్తుతోంది. మరి ఈ విషయంలో అసలు నిజం ఏంటో ఇక్కడ తెలుసుకుందాం. ఇది కేవలం అపోహ మాత్రమేనని నిపుణులు చెబుతున్నారు. దీనికి సంబంధించి శాస్త్రీయ ఆధారం లేదు. అధ్యయనం ప్రకారం, బీర్ ఒక ఆల్కహాలిక్ డ్రింక్. ఇది ఒక మూత్రవిసర్జన, దీనిని తాగినప్పుడు సాధారణం కంటే ఎక్కువ మూత్రం ఉత్పత్తి అవుతుంది, ఇది చిన్న రాళ్లను బయటకు తీయడంలో సహాయపడుతుంది, అయితే ఇది ఇప్పటివరకు ఏ అధ్యయనంలో నిరూపించబడలేదు, అందుకే డాక్టర్ రోగికి బీర్ తాగమని సలహా ఇవ్వడు. సిఫార్సు చేయబడదు. రోగి కిడ్నీలో రాళ్ళను తొలగించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు బీర్ తాగడం ప్రారంభిస్తే, దాని పర్యవసానాలు తీవ్రంగా ఉండవచ్చు, అది వ్యసనానికి గురయ్యే ప్రమాదాన్ని పెంచుతుంది, అయితే ఎక్కువ బీర్ తాగడం వల్ల మీ శరీరంపై ప్రతికూల ప్రభావం చూపే డీహైడ్రేషన్ కూడా వస్తుంది, మీ మూత్రపిండాలు దెబ్బతింటాయి. అయితే, మద్యం ఏ సందర్భంలోనైనా హానికరం. రెగ్యులర్ బీర్ తాగేవారిలో ఆక్సలేట్ కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. రక్తాన్ని శుద్ధి చేయడం, మూత్రాన్ని వడపోత చేయడం, తద్వారా వ్యర్థాలను బయటకు నెట్టివేయడం కిడ్నీల పని, అయితే ఆహారంలో క్యాల్షియం, పొటాషియం, మినరల్స్ అధికంగా ఉండటం వల్ల కిడ్నీల నుంచి వ్యర్థ పదార్థాలు పూర్తిగా తొలగిపోవు. తరువాత, ఈ వ్యర్థ పదార్థాలు క్రమంగా పేరుకుపోతాయి మరియు రాళ్ల రూపాన్ని తీసుకుంటాయి, దీనిని వైద్య భాషలో కిడ్నీ స్టోన్ అంటారు.

## వెల్లుల్లి పరిమితి దాటి తింటే అనారోగ్య సమస్యలు తప్పవు

వెల్లుల్లిని ఆయుర్వేదం ప్రకారం సర్వ రోగ నివారిణిగా పిలుస్తారు. ముఖ్యంగా వెల్లుల్లి లేకుండా ఏ భారతీయ వంటకం ఉండదంటే అతిశయోక్తి కానేకాదు. వెల్లుల్లి కేవలం రుచి కోసమే కాకుండా..ఆరోగ్యపరంగా కూడా చాలా లాభదాయకం. ప్రతి భారతీయుని కిచెన్‌లో తప్పకుండా లభించే పదార్థం వెల్లుల్లి, సాధారణంగా వెల్లుల్లిని తాలింపు కోసం లేదా వంటల రుచి కోసం ఉపయోగిస్తుంటారు. అయితే అంతకుమించిన ఆరోగ్య ప్రయోజనాలు వెల్లుల్లిలో దాగున్నాయి. అందుకే తల్లి చేసే మేలు వెల్లుల్లి కూడా చేయదంటారు. కానీ వెల్లుల్లిని మోతాదుకు మించి తినకూడదంటారు. పరిమితి దాటితే వెల్లుల్లితో అనర్థాలే ఎక్కువ. ఆ వివరాలు మీ కోసం..వెల్లుల్లిని ఆయుర్వేద శాస్తంలో ఆరోగ్య ఖజానాగా పిలుస్తారు. ఎందుకంటే వెల్లుల్లిలోని పోషక పదార్థాలు చాలా ఎక్కువ. ఇందులో విటమిన్ బి1, కాల్షియం, కాపర్, పొటాషియం, ఫాస్పరస్, ఐరన్ వంటి న్యూట్రియంట్లు ఉన్నాయి. అయితే మోతాదు దాటకూడదు. వెల్లుల్లి మోతాదు దాటి తినడం వల్ల ఛాతీలో మంట సమస్య ఏర్పడుతుంది. దీనికి కారణం వెల్లుల్లిలో ఎసిడిక్ కాంపౌండ్ ఎక్కువగా ఉండటం. ఈ మంట చాలా సందర్భాల్లో భరించలేకుండా ఉంటుంది.వెల్లుల్లితో రక్తపోటు నియంత్రణలో ఉంటుంది. అందుకే లో బీపీ రోగులు వెల్లుల్లి తీసుకోకూడదు. వెల్లుల్లి అతిగా తీసుకుంటే హైపర్ టెన్షన్ సమస్య ఏర్పడవచ్చు. శరీరంలో విపరీతమైన అలసట ఉంటుంది. వెల్లుల్లి స్వభావం వేడి చేసేది కావడంతో వేసవిలో వెల్లుల్లికి దూరంగా ఉండాలి. చలి సంబంధిత సమస్యలున్నప్పుడు వెల్లుల్లి తినడం చాలామందికి అలవాటు. ఆరోగ్యానికి ఎంతమంచిదైనా సరే రోజుకు 1-2 రెమ్మలకు మించి తినకూడదు. అదే పనిగా వెల్లుల్లి తింటే నోటి దుర్వాసన కూడా వస్తుంది.

# గోగితా చిక్వాడ్జే దర్శకత్వంలో ..వారణాసి మేకింగ్ వీడియో

దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్టాత్మక చిత్రం 'వారణాసి'పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. మహేశ్ బాబు, ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ వంటి స్టార్ కాస్ట్‌తో తెరకెక్కుతున్న ఈ గ్లోబల్ అడ్వెంచర్‌పై రోజుకో ఆసక్తికరమైన వార్త బయటకు వస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన మేకింగ్‌పై ఓ ఇంట్రెస్టింగ్ విషయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. రాజమౌళితో పాటు మరో దర్శకుడు కూడా 'వారణాసి' ప్రాజెక్ట్‌లో భాగమయ్యారనే వార్త ఆసక్తిని పెంచుతోంది. అయితే ఆయన ప్రధాన సినిమాకు దర్శకత్వం వహించడం లేదు. 'వారణాసి' ఎలా రూపుదిద్దుకుంటోంది? రాజమౌళి టీమ్ ఎలాంటి కష్టపడుతోంది? నటీనటులు ఎలాంటి వర్క్‌షాప్స్‌కు హాజరయ్యారు? భారీ సెట్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు ఎలా తెరకెక్కుతున్నాయి? వంటి అంశాలను చూపించే ప్రత్యేక మేకింగ్ డాక్యుమెంటరీని రూపొందించే బాధ్యతను ఆయన తీసుకున్నట్లు తెలుస్తోంది. ఈ మేకింగ్ డాక్యుమెంటరీ కోసం జార్జియాకు చెందిన దర్శకుడు గోగితా చిక్వాడ్జేను ఎంపిక చేసినట్లు సమాచారం. డాక్యుమెంటరీ చిత్రీకరణలో అనుభవం ఉన్న ఆయన.. 'వారణాసి' ప్రీ-ప్రొడక్షన్ దశ నుంచే తన కెమెరాలతో ఈ ప్రయాణాన్ని రికార్డ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. నటీనటుల వర్క్‌షాప్స్, పాత్రల కోసం వారు చేస్తున్న ప్రత్యేక శిక్షణ, భారీ సెట్స్ నిర్మాణం, షూటింగ్ పక్రియ, యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ వంటి అనేక కీలక అంశాలను ఈ డాక్యుమెంటరీలో చూపించనున్నట్లు సమాచారం. సాధారణంగా సినిమా విడుదలకు ముందు లేదా షూటింగ్ చివరి దశలో మేకింగ్ వీడియోలను రూపొందిస్తుంటారు. కానీ 'వారణాసి' విషయంలో మాత్రం సినిమా రూపకల్పన ప్రారంభమైనప్పటి నుంచే మేకింగ్‌ను డాక్యుమెంట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రాజమౌళి ఆలోచనా విధానం, ప్రీ-ప్రొడక్షన్‌లో ఆయన చేసే ప్లానింగ్, నటీనటుల ప్రిపరేషన్, భారీ స్థాయిలో విజువల్స్‌ను రూపొందించే విధానం వంటి విషయాలను ప్రేక్షకులు మరింత దగ్గరగా చూసే అవకాశం ఉంటుంది. రాజమౌళి సినిమాల మేకింగ్‌కు ప్రత్యేకమైన క్రేజ్ ఉంటుంది. 'బాహుబలి' చిత్రానికి సంబంధించిన మేకింగ్ కంటెంట్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. అలాగే 'ఆర్ఆర్ఆర్'కు సంబంధించిన మేకింగ్ వీడియోలు, షూటింగ్ విశేషాలు కూడా సోషల్ మీడియాలో భారీగా వైరల్ అయ్యాయి. ఈ నేపథ్యంలో 'వారణాసి' మేకింగ్ డాక్యుమెంటరీని మరింత భారీ స్థాయిలో రూపొందిస్తు న్నట్లు తెలుస్తోంది. సినిమా వెనుక ఉన్న అసలు శ్రమను, రాజమౌళి విజన్‌ను, అంతర్జాతీయ స్థాయిలో ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్న విధానాన్ని ఇందులో చూపించనున్నట్లు సమాచారం. 'వారణాసి' కేవలం భారతీయ మార్కెట్‌ను మాత్రమే కాకుండా అంతర్జాతీయ ప్రేక్షకులను దృష్టిలో పెట్టుకుని రూపొందిస్తున్న సినిమా కావడంతో.. మేకింగ్ డాక్యుమెంటరీకి కూడా గ్లోబల్ స్థాయిలో మంచి డిమాండ్ ఏర్పడే అవకాశం ఉందని చిత్ర వర్గాలు భావిస్తున్నట్లు టాక్. సినిమా డిజిటల్ హక్కులతో పాటు మేకింగ్ డాక్యుమెంటరీని కూడా ప్యాకేజీలో భాగంగా చేసే ఆలోచనపై చర్చలు జరుగుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది.





## డిసి ఆద్యంతం అద్భుతంగా ఉంది

నటుడు మహేశ్ బాబు రివ్యూ



లోకేశ్ కనగరాజ్, వామికా గబ్బి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'డీసీ' ఇటీవల విడుదలైన ప్రశంసలు అందుకుంటోంది. తాజాగా స్టార్ హీరో మహేశ్ బాబు 'డీసీ' చిత్రానికి శుభాకాంక్షలు తెలిపారు. ఎక్స్ వేదికగా తన రివ్యూ ఇచ్చారు. చాలా వినూత్నమైన, అద్భుతమైన చిత్రం. చాలా బాగుంది. ప్రతి అంశం నచ్చింది. ఈ సినిమా కోసం వర్క్ చేసిన వారందరికీ అభినందనలని పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్‌ను దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ రీషేర్ చేస్తూ మహేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. 'మీ పోస్ట్ నిజంగా చాలా సంతోషాన్నిచ్చింది. మీరు డీసీని చూడటం, దీన్ని అభినందించడం చాలా ప్రత్యేకంగా అనిపిస్తోంది. మీ ప్రేమకు, కామెంట్స్‌కు ధన్యవాదాలు' అని రిప్లై ఇచ్చారు. దర్శకుడిగా తనదైన ముద్రవేసిన లోకేశ్ కనగరాజ్‌లో నటుడు కూడా ఉన్నారు. పలు చిత్రాల్లో ఆయన తళుక్కున మెరిశారు. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రమే 'డీసీ'. ఇటీవల విడుదలై పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. 'డీసీ' చూశాను. సినిమాను ప్రేమించే ప్రతి ఒక్కరూ ఈ చిత్రాన్ని తప్పకుండా చూడాలి. చిత్రబృందానికి అభినందనలు. దర్శకుడు అరుణ్ మాథేశ్వరన్ చాలా గొప్పగా తీశారు. అనిరుధ్ నిజంగా అద్భుతం చేశారు. లోకేశ్ కనగరాజ్ హీరో పాత్రలో ఒదిగిపోయారని అల్లు అర్జున్ ప్రశంసించారు.

## పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తున్న విశ్వనాథ్ అండ్ సన్స్




సూర్య హీరోగా నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్ అండ్ సన్స్' తెలంగాణ బాక్సాఫీస్ వద్ద ఊహించని రీతిలో దూసుకెళ్తోంది. విడుదలైన తొలి రోజు నుంచే పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకున్న ఈ సినిమా.. తొలి వీకెండ్‌లోనూ అదే జోరును కొనసాగించింది. ముఖ్యంగా నైజాం ఏరియాలో ఈ చిత్రానికి ప్రేక్షకుల నుంచి భారీ స్పందన లభిస్తోంది. వీకెండ్‌లో భాగంగా ఆదివారం మూడో రోజు నైజాం ప్రాంతంలో 'విశ్వనాథ్ అండ్ సన్స్' రూ.5.2 కోట్ల గ్రాస్ వసూలు చేసినట్లు ట్రేడ్ వర్గాల సమాచారం. దీంతో తొలి మూడు రోజుల్లో నైజాంలో ఈ సినిమా మొత్తం రూ.14 కోట్ల గ్రాస్ మార్కును అందుకుంది. మొదటి మూడు రోజుల్లోనే ఈ స్థాయి వసూళ్లు రావడం సినిమాపై ఉన్న క్రేజ్‌ను తెలియజేస్తోంది. దేశవ్యాప్తంగా ఈ చిత్రానికి అత్యుత్తమంగా స్పందించిన ప్రాంతంగా నైజాం నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి.వీకెండ్‌లో భారీ వసూళ్లు సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. సోమవారం నాటికి జీఎస్టీ మినహాయించి బ్రేక్ ఈవెన్ టా÷-గ్గ÷ట్‌ను అందుకునే అవకాశం ఉందని సమాచారం. ఇదే జోరు వర్కింగ్ డేస్‌లోనూ కొనసాగితే నైజాం డిస్టిబ్యూటర్లకు మంచి లాభాలు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే కథ, సూర్య నటన, వెంకీ అట్లూరి దర్శకత్వం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తున్నాయి. విడుదలకు ముందు ఉన్న అంచనాలకు తగ్గట్టుగానే సినిమా ప్రేక్షకుల నుంచి మంచి స్పందనను అందుకుంటోంది. దీంతో రోజురోజుకూ థియేటర్లలో ఆక్యుపెన్సీ పెరుగుతున్నట్లు తెలుస్తోంది. వెంకీ అట్లూరి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో సూర్యకు జోడీగా మమితా బైజు నటించారు. సితార ఎంటర్‌టైన్ మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. జి.వి. ప్రకాష్ కుమార్ సంగీతం అందించారు. మొత్తానికి తొలి మూడు రోజుల్లోనే నైజాంలో రూ.14 కోట్ల గ్రాస్ సాధించిన 'విశ్వనాథ్ అండ్ సన్స్'.. రాబోయే రోజుల్లో ఎలాంటి వసూళ్లను నమోదు చేస్తుందో చూడాలి.

## చిరంజీవి పాత్రను ఎలివేట్ చేసేలా బాబీ సినిమా

మెగాస్టార్ చిరంజీవి అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న మరో క్రేజీ ప్రాజెక్ట్ శరవేగంగా షూటింగ్ జరుపుకుంటోంది. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి మరోసారి కలిసి పనిచేస్తుండటంతో ఈ సినిమాపై భారీ అంచనాలు నెలకొన్నాయి. చిరంజీవి కెరీర్‌లో 158వ చిత్రంగా తెరకెక్కుతున్న ఈ మూవీకి సంబంధించిన తాజా అప్‌డేట్ ఇప్పుడు మెగా అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. భారీ యాక్షన్ షెడ్యూల్‌లో భాగంగా కీలకమైన పోరాట సన్నివేశాలను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్స్ రామ్,లక్ష్మణ్ మాస్టర్స్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో ఫైటర్లతో ఈ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు సమాచారం. సినిమాలో యాక్షన్‌కు ప్రత్యేక ప్రాధాన్యత ఉండటంతో ఈ సన్నివేశాలను అత్యంత భారీ స్థాయిలో రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది. చిరంజీవి అభిమానులను ఆకట్టుకునేలా యాక్షన్ ఎపిసోడ్స్‌ను డిజైన్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఇక ఈ సినిమా నుంచి మరో క్రేజీ అప్‌డేట్ బయటకు వచ్చింది. ప్రస్తుతం జరుగుతున్న యాక్షన్ షెడ్యూల్ పూర్తయిన తర్వాత వచ్చే వారం నుంచి స్పెషల్ సాంగ్ షూటింగ్ ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ పాటలో చిరంజీవి పూర్తిగా స్టైలిష్ లుక్‌లో కనిపించనున్నారట. ఈ స్పెషల్ సాంగ్ కోసం మెగాస్టార్ లుక్‌ను ఇప్పటికే లాక్ చేసినట్లు సమాచారం. చిరంజీవి ఎనర్జీకి తగ్గట్టుగా పాటను డిజైన్ చేస్తున్నారని, తెరపై ఆయన స్టైలిష్ అవతార్ అభిమానులను మెస్మరైజ్ చేయడం ఖాయమని చిత్ర వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ సినిమాలో చిరంజీవి పాత్రను దర్శకుడు బాబీ చాలా ప్రత్యేకంగా డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. మెగాస్టార్ పాత్రలో పలు రకాల వేరియేషన్స్ ఉంటాయని సమాచారం. ఇప్పటివరకు చిరంజీవిని చూడని ఓ కొత్త కోణంలో ప్రేక్షకులకు చూపించాలనే ఉద్దేశంతో బాబీ ఈ కథను సిద్ధం చేసినట్లు టాక్. అదే సమయంలో సినిమాలో ఫ్యామిలీ ఎమోషన్స్‌కు కూడా పెద్దపీట వేస్తున్నట్లు తెలుస్తోంది. యాక్షన్, ఎమోషన్, ఫ్యామిలీ డ్రామాతో పాటు చిరంజీవి స్టైల్, కామెడీ, మాస్ ఎలిమెంట్స్‌ను మేళవించి కథను రూపొందిస్తున్నట్లు సమాచారం.



## రాముడి సుగుణాలు కనిపించాలంటే రావణుడి పాత్ర బలంగా ఉండాల్సిందే: యశ్



కన్నడ స్టార్ యశ్ ప్రస్తుతం 'టాక్సిక్', 'రామాయణ' చిత్రాలతో వార్తల్లో నిలుస్తున్నారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. 'రామాయణ' గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. రావణుడి పాత్రకి ఎందుకు ఓకే చెప్పారో వెల్లడించగా.. ఆ సమాధానం ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది. రాముడి మంచితనాన్ని, సుగుణాలను చూపించాలంటే రావణుడి పాత్రలో బాగా నటించాలి. నేను విలన్ పాత్రలకు న్యాయం చేయగలను. మంచి పాత్రలు చేసినా నావంతు ప్రయత్నం తప్పకుండా చేస్తాను. 'రామాయణ' కోసం మేమంతా ఇగోని పక్కన పెట్టాం. బెస్ట్ టీమ్‌తో కలిసి పనిచేస్తున్నాం. రామాయణం గురించి ప్రతి ఒక్కరికీ తెలిసే ఉంటుంది. నేను చిన్నప్పుడు మా తాత చెబితే ఒకలాగా ఊహించుకునే వాడిని. టీవీలో, సినిమాల్లో చూసిన తర్వాత ఆ ఊహ మారింది. అందరికీ తెలిసిన కథైనప్పటికీ దాన్ని కొత్తగా చూపించగలగాలి. అలా అని మతపరమైన భావాలను దెబ్బతీయకూడదు. ఇది చాలా కష్టమైన పని. నా స్నేహితుడు నమిత్ మల్హోత్రా ఈ సినిమా కోసం బాగా రిస్క్ తీసుకుంటున్నారు. ప్రేక్షకులు దీన్ని ఆదరిస్తారని నమ్ముతున్నానని యశ్ పేర్కొన్నారు. నితీశ్ తివారి దర్శకత్వంలో ముస్తాబైన ఈ బహుభాషా చిత్రంలో శ్రీరాముడిగా రణ్‌బీర్ కపూర్ నటించగా.. సీత పాత్రను సాయిపల్లవి పోషించారు. యశ్ ఇందులో రావణుడి పాత్ర పోషిస్తూనే నమిత్ మల్హోత్రాతో కలిసి నిర్మించారు. ఈ సినిమా రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 'రామాయణ: పార్ట్ 1' ఈ దీపావళికి విడుదల కానుంది. ప్రచారంలో భాగంగా ఇటీవల ట్రైలర్‌ని విడుదల చేసిన విషయం తెలిసిందే. ఇక, యశ్ మరో సినిమా 'టాక్సిక్'.. ఆగస్టు 26న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది గీతూ మోహన్‌దాస్ తెరకెక్కించిన ఈ మూవీలో కియారా అద్వాణీ, నయనతార, రుక్మిణీ వసంత్, హ్యూమా ఖురేషీ, తారా సుతారియా తదితరులు కీలక పాత్రలు పోషించారు.